## పాఠశాల బస్సులను ఆర్టీఏ అధికారుల కొరడా

హైదరాబాద్,దాదాపు 45 రోజుల వేసవి సెలవుల అనంతరం తెలంగాణలో పాఠశాలలు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు ఫోకస్ చేశారు. నిబంధనలు పాటించని, ఫిట్‌నెస్‌లేని, సరైన పత్రాలు లేని బస్సులను సీజ్ చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ వంటి ప్రధాన నగరాలు, జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.రాజేంద్రనగర్, ఆరాంఘర్, అప్పా జంక్షన్, శంషాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, మియాపూర్ తదితర ప్రాంతాల్లోని స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు గురువారం ఉదయం తనిఖీలు చేశారు. విద్యార్థులను తరలించే పాఠశాల బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సు ఆర్సీ, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ వంటివి ఉన్నాయా? లేదా? అనేవి చెక్ చేశారు. ముఖ్యంగా హ్యాండ్ బ్రేక్, ఫైర్ ఎక్సిటింగిషర్, మెడికల్ కిట్‌లను కూడా పరిశీలించారు.



# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :95 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శుక్రవారం 13-06-2025 పేజీలు:4 వెల: 2.00


## కరోనాతో ముగ్గురు మృతి..



హైదరాబాద్,భారత్‌లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి.. పదులు, వందలుగా ఉన్న కేసులు.. ఇప్పుడు వేలకువేలుగా పెరిగిపోవడం భయాందోళన కలిగిస్తోంది.. గురువారం కూడా కరోనా కేసుల సంఖ్య పెరిగింది. గత 24 గంటల్లో (గురువారం ఉదయం) దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7,154కి పెరిగిందని ఆరోగ్య – కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో 33 కేసులు నమోదయ్యాయి. 983 మంది కరోనా నుంచి కోలుకున్నారు. గురువారం కొత్తగా 3 కోవిడ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయి.. మహారాష్ట్రలో రెండు, మధ్యప్రదేశ్‌లో ఒకరు మరణించారు. 2025 జనవరి నుంచి మొత్తం మరణాల సంఖ్య 77కి చేరుకుంది. ఈ సంవత్సరం ఇప్పటివరకు 8,000 మందికి పైగా ఈ ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్నట్లు ప్రభుత్వం డేటాలో వెల్లడించింది.దాదాపు అన్ని రాష్ట్రాల్లో యాక్టివ్ కేసులలో స్వల్ప పెరుగుదల నమోదైనప్పటికీ.. కేరళలో అత్యధిక సంఖ్యలో కోవిడ్ –19 కేసులు నమోదవుతున్నాయి. గురువారం ఉదయం యాక్టివ్ కేసుల సంఖ్య 2165 గా ఉంది. ఇండియా కోవిడ్ –19 డాష్‌బోర్డ్ ప్రకారం.. గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా ఈ సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో యాక్టివ్ కేసులను నివేదించాయి. ఇదిలాఉంటే.. ఏపీలో 30 కేసులు పెరిగి.. యాక్టివ్ కేసుల సంఖ్య 103కి చేరుకుంది. తెలంగాణలో 1 కేసు నమోదు కాగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 12కి చేరింది.దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రుల సంసిద్ధతను అంచనా వేయడానికి దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్‌లను ప్రారంభించింది.. తగినంత ఆక్సిజన్ సరఫరా, ఐసోలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందులు ఉండేలా చూసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. చాలా కేసులు తేలికపాటివని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇంటి సంరక్షణలో ఉంటే సరిపోతుందని.. ఏమైనా జబ్బులు ఉంటే చికిత్స తీసుకోవాలని సూచించింది.

## కేటీఆర్‌కు మరో అరుదైన ఆహ్వానం..

హైదరాబాద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అరుదైన ఆహ్వానం అందింది. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ 2025లో ప్రసంగించేందుకు రావాలని ఆహ్వానించారు.ఈ ఫోరమ్ జూన్ 20, 21వ తేదీల్లో యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరగనుంది. ' భారత అభివృద్ధికి ఫ్రంటీయర్ టెక్నాలజీస్' అనే థీమ్‌పై ఈ ఏడాది ఫోరమ్ దృష్టిసారించింది. భారత్‌లో సాంకేతికత, ఇన్నోవేషన్, సస్టైనబిలిటీని కలగలిపి ముందుకెళ్లే అంశాలపై ఈ ఫోరమ్‌లో చర్చ జరగనుంది. ఈ నేపథ్యంలో తన విలువైన అభిప్రాయాలను తెలియజేసేందుకు రావాలని కేటీఆర్‌కు ఫోరమ్ వ్యవస్థాపకుడు, చైర్‌పర్సన్ సిద్ధార్థ్ సెథీ ఆహ్వాన లేఖ పంపించారు. "భారతదేశ అభివృద్ధికి మీరు చూపించిన మార్గదర్శకత, టెక్నాలజీ ఆధారిత పాలన, పెట్టుబడుల వృద్ధికి మీరు తీసుకున్న చర్యలు అంతర్జాతీయ వేదికపై యువతకు ప్రేరణ కలిగిస్తాయి" అని ఆయన లేఖలో పేర్కొన్నారు.ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్‌లో 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే ప్రధాన అంశంపై చర్చ జరగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ పెట్టుబడులను



ఆకర్షించేందుకు తీసుకున్న చర్యలు, అభివృద్ధి దిశగా అమలు చేసిన పారిశ్రామిక విధానాలు, ప్రజా సేవలను మెరుగుపరచడంలో సాంకేతిక వినియోగం వంటి అంశాలపై ఆయన ప్రసంగించనున్నారు.

## నారీమణులకు కేంద్రం గుడ్‌న్యూస్..! వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో..!

న్యూఢిల్లీ,ఎన్డీఏ ప్రభుత్వం ఇటీవలే 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా 11 ఏళ్ల పాలనలో మహిళలకు పెద్ద పీట వేశామని.. వారిని ఎంతగానో గౌరవించినట్లు బీజేపీ శ్రేణులు ప్రకటించారు.తాజాగా నారీమణులకు కేంద్రం మరో శుభవార్త చెప్పబోతుంది. 2029లో జరిగి లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉన్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది.ఇటీవలే 2027, మార్చి నాటికి జనాభా లెక్కలు, కుల గణన పూర్తి చేస్తామని కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇక కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా డీలిమిటేషన్ చేయబోతున్నట్లు ప్రకటించారు. అంటే నియోజకవర్గాల పునర్విభజన చేయబోతున్నట్లు వెల్లడించారు. దీనిపై కూడా కేంద్రం తీవ్ర కసరత్తు చేస్తోంది. వీటిన్నింటినీ చాలా వేగంగా పూర్తి చేయాలని మోదీ ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇవన్నీ పూర్తైతే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఒక క్లారిటీ వస్తుందని భావిస్తోంది. ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లు (నూట ఇరవై ఎనిమిదవ సవరణ)ను సెప్టెంబర్ 19, 2023న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 2029 ఎన్నికల నాటికి ఈ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రం భావిస్తోంది. అదే గనుక జరిగితే లోక్‌సభ మరియు అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు మూడింట ఒక వంతు సీట్ల రిజర్వేషన్ అమలులోకి వస్తుంది.నారీ శక్తి వందన్ అధినియం అని పిలువబడే ఈ బిల్లు డీలిమిటేషన్‌తో ముడిపడి ఉంది. నియోజకవర్గాల పునర్విభజనం పూర్తైతే దాదాపుగా కేంద్రానికి ఒక క్లారిటీ



రానుంది. దీన్ని ఛేష్ చేసుకుని మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని చూస్తోంది. నూటికి నూటి శాతం వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఇక డీలిమిటేషన్‌తో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు చేయబడిన సీట్లను కూడా నియమిస్తారు.అయితే డీలిమిటేషన్‌పై తమిళనాడులో అధికార పార్టీ డీఎంకే ఆందోళన చేస్తోంది. డీలిమిటేషన్‌తో రాష్ట్రం నష్టపోతుందని డీఎంకే వాదిస్తోంది. లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గిపోతుందని.. దీంతో రాష్ట్రం తీవ్రంగా దెబ్బ తింటుందని ఫైట్ చేస్తోంది. అయితే డీఎంకే వాదనను అమిత్ షా తోసిపుచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క సీటు కూడా తగ్గదని తేల్చి చెప్పారు.

## బెంగాల్‌లోని మహేస్థలాలో కొనసాగుతున్న ఉద్రిక్తత



బెంగాల్: పశ్చిమ బెంగాల్ మహేశ్థలాలో శివాలయం ధ్వంసం ఘటనతో అల్లర్లు చెలరేగాయి. దుకాణాలకు, ఇళ్లకు నిప్పు పెట్టడంతో పాటు వాహనాలను తగలబెట్టారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి 40 మందిని అరెస్ట్ చేశారు. బీజేపీ ఈ ఘటనపై టీఎంసీ ప్రభుత్వాన్ని తప్పుపట్టగా, టీఎంసీ నేతలు బీజేపీపై మతరంగు పులిమి హింసను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.బెంగాల్‌లో మరోసారి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కోల్‌కతా శివార్ల లోని మహేస్థలాలో బుధవారం అల్లర్లు చెలరేగడంతో పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. శివాలయాన్ని ధ్వంసం చేయడంతో గొడవలు చెలరేగినట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని , అందుకు ఈ ఘటన నిదర్శనమని బీజేపీ శాసనసభా పక్ష నేత సువేందు అధికారి ఆరోపించారు. బెంగాల్ అసెంబ్లీ బయట ఈ ఘటనపై బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. మహేస్థలా వెళ్లడానికి వాళ్లు ప్రయత్నించారు. అయితే పోలీసుల వాళ్లను అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. తరువాత బీజేపీ నేతలు రాజ్‌భవన్‌కు వెళ్లి ఈ ఘటనపై గవర్నర్ ఆనందబోస్‌కు ఫిర్యాదు చేశారు.అయితే ఓ షాప్‌కు సంబంధించి రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయని పోలీసులు తెలిపారు. అల్లరిమూకల దాడిలో పోలీసులకు గాయాలయ్యాయి. దుకాణాలకు , ఇళ్లకు నిప్పు పెట్టారు. వాహనాలను తగలబెట్టారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. అల్లర్ల కేసులో 40 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. గొడవలో పోలీసుల వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.అయితే రాష్ట్రంలో మరోసారి హింసను రెచ్చగొట్టడానికి బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. స్థానకుల మధ్య గొడవకు మతం రంగు పులిపే ప్రయత్నం చేస్తున్నారని టీఎంసీ నేతలు ఆరోపించారు.

## ఆనాడే వేరే పార్టీలోకి పోలేదు..

హైదరాబాద్,గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.కొన్ని చానళ్లలో ఒక వార్త నడుస్తోందని,రాజాసింగ్ వేరే పార్టీలో వెళతారా.. వేరే పార్టీని తీసుకొని వస్తారా.. లేక వేరే పార్టీ పెడతారా అనే వా ర్తలు వస్తున్నాయని అన్నారు. దీనిపై స్పందించిన ఆయన మీడియా సమావేశం లో మాట్లాడారు. గతంలో తాను పార్టీ నుంచి సస్పెండ్ అయ్యాయని.. 14 నెలలు పార్టీకి దూరంగా ఉన్నానని అన్నారు. అప్పుడే తాను వేరే పార్టీలోకి పోలేదని.. వేరే పార్టీని తీసుకొని రాలేదని.. వేరే పార్టీ పెట్టలేదని రాజా సింగ్ చెప్పారు.

వారిని వదిలిపెట్టను...

తాను బీజేపీ తప్ప వేరే పార్టీలోకి వెళ్లనని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. తనతో కొంతమంది ఆట ఆడుతున్నారని.. తాను వేరే పార్టీలోకి వెళ్లనని వాళ్లకు తెలుసునని.. అందుకే వాళ్లు తన నియోజకవర్గంలో ఏమైనా చేయొచ్చుననే ఆలోచన పెట్టుకున్నారని అన్నారు. ఇవాళ తాను ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌లను చూసి బీజేపీలో ఉన్నానని లేకపోతే ఎప్పుడో పార్టీని వీడి వెళ్లిపోయేవాడినని చెప్పారు. తనకు మొదటి పార్టీ టీడీపీ అని, చివరిది భారతీయ జనతా పార్టీ అని.. ఇది తన నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. పార్టీని వీడానంటే ఇక తాను రాజకీయాలను వదిలివేస్తాను తప్ప.. వేరే పార్టీలో చేరనని తెలిపారు. పార్టీలో తనను వేధించే వారిని కూడా వదిలిపెట్టనని ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు.కాగా తెలంగాణ అభివృద్ధికి కేంద్ర నుంచి కావాల్సిన నిధుల అంశంలో బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెవులు లేని వాళ్లని అడిగితే ఏం లాభం..? చెవులు ఉన్న వాళ్లని అడిగితేనే ఫలితం ఉంటుందని.. సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు.



ప్రధాని మోదీ మంచి నాయకుడని, సీఎం ప్రధానిని కలిస్తే పనులు జరుగుతాయని సూచించారు. అలాగే, సీఎం రేవంత్‌నుద్దేశించి రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో నోరు మూసుకుని ఉంటారని, కానీ ఢిల్లీకి వెళ్లిన తర్వాత నోరు ఎత్తుతారని, ఆ సీక్రెట్ ఏంటో చెప్పాలని కోరారు. 'రేవంత్‌రెడ్డి గారు మొన్న మీరు కిషన్‌రెడ్డి ముందే ఉన్నారు కదా.. అప్పుడు కిషన్ రెడ్డిని ఎందుకు అడగలేదు.. ఈ రోజు ఢిల్లీలో మీరు ఎందుకని బీజేపీ, కేంద్ర మంత్రిపై విమర్శలు చేస్తున్నారు?' అని రాజాసింగ్ ప్రశ్నించారు. ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలిసి విషయాన్ని ఆయన ముందు ఉంచాలని సూచించారు. అలాగే, 2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయనే దానిపై ఓ జాబితాను తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

## ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. సైన్యాన్ని వెనక్కి పిలిచిన ట్రంప్



వాషింగ్టన్,ఇరాన్‌తో అణు ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో అతడు మధ్యప్రాచ్యాన్ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.అదో ప్రమాదకరమైన ప్రాంతం అని పేర్కొన్నారు. తమ సైనిక సిబ్బందిని అక్కడి నుంచి తరలిస్తున్నాం.. ఆ ప్రాంతాన్ని వీడాలని యూఎస్ ఆర్మీకి నోటీసులు జారీ చేశాం.. ఏం జరుగుతుందో చూడాలని ఆయన తెలిపారు. ఈ ఉద్రిక్తతలు తగ్గాలంటే ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని వార్నింగ్ ఇచ్చాడు. అణు చర్చలు విఫలమైతే, ఇరాన్‌పై దాడులు చేస్తామని ట్రంప్ పదే పదే హెచ్చరికలు చేశాడు.ఈ నేపథ్యంలో తమపై దాడులు జరిగితే ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్జాదే వార్నింగ్ ఇచ్చారు. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే యూఎస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా, కువైట్‌లోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం నాడు ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది. అందులో తమ సిబ్బందిని ఎక్కడికీ తరలించడం లేదని వెల్లడించింది. అయితే, కువైట్ అధికారులు మాత్రం దీనికి భిన్నంగా ట్రావెల్ అడ్వైజరీని విడుదల చేశారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో అత్యవసరంగా అమెరికా సిబ్బంది ఆ ప్రాంతాన్ని వీడిచి పెట్టాలని కోరింది. మరోవైపు, ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ రెడీ అవుతున్నట్లు పలు మీడియాల్లో న్యూస్ ప్రసారం అవుతుంది. ఈ నేపథ్యంలో తమ బలగాలను వెనక్కి రప్పించాలని అమెరికా నిర్ణయించుకోవడం గమనార్హం.

## షేక్ హసీనాను అప్పగించమంటే మోడీ ఏమన్నారంటే..! యూనస్ కీలక వ్యాఖ్యలు

ఢాకా,పధాని మోడీ గురించి బంగ్లాదేశ్ తాత్కాలిక అధినేత ముహమ్మద్ యూనస్ కీలక వ్యాఖ్యలు చేశారు. షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని అడిగితే మోడీ అంగీకరించలేదని తెలిపారు.గతేడాది పెద్ద ఎత్తున బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఉద్యమం జరిగింది. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో షేక్ హసీనా దేశాన్ని వదిలి భారత్‌కు వచ్చేశారు. అనంతరం నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ఎన్నికయ్యారు. అనంతరం షేక్ హసీనాను బంగ్లాదేశ్ రప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు.తాజాగా లండన్‌లోని చాథమ్ హౌస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో యూనస్ మాట్లాడారు. భారత్‌లో నివాసం ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని ప్రధాని మోడీని అడిగితే అందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు. హసీనాను కట్టడి చేయాలని కోరగా అందుకు కూడా అంగీకరించలేదని వెల్లడించారు.బిమ్‌స్టెక్ సదస్సులో ప్రధాని మోడీతో షేక్ హసీనా గురించి మాట్లాడానని.. ఆన్‌లైన్‌లో హసీనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని.. దీంతో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారని తెలియజేసినట్లు చెప్పారు. ఆమె ప్రకటనలు, ప్రసంగాలు అడ్డుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. అందుకు మోడీ.. అది సోషల్ మీడియా.. దాన్ని నియంత్రించడం సాధ్యం కాదని చెప్పినట్లు వెల్లడించారు.షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించేందుకు



సుముఖంగా లేనట్లు కనిపిస్తోందని చెప్పారు. ఇప్పటికే భారత్‌కు లేఖ రాశామని.. ఇప్పటికీ చట్టపరమైన చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. హసీనా చేసిన నేరాలకు నోటీసులు కూడా పంపించామని.. ఆమెకు సంబంధించిన నేరాలు ఇంకా వస్తూనే ఉన్నాయని తెలిపారు. చట్టబద్ధంగానే ఆమెను బంగ్లాదేశ్‌కు తీసుకురావాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. పొరుగు దేశమైన భారత్‌తో మంచి సంబంధాలు ఉండాలనే కోరుకుంటున్నామని.. కానీ భారత పత్రికలు నకిలీ వార్తలు సృష్టిస్తున్నాయని యూనస్ ఆరోపించారు.

## పాక్‌కి భారత్ మరో షాక్.. ఆ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుకు ప్లాన్..



జమ్మూ కాశ్మీర్: పాకిస్తాన్ కు భారత్ మరో షాక్ ఇచ్చింది. జమ్మూ కాశ్మీర్‌లోని హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై మోడీ సర్కార్ ప్రణాళికలు రెడీ చేస్తోందని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వెల్లడించారు.అయితే, ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాక్‌తో ఉన్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. ఇక, సింధు, దాని ఉప నదులపై భారత్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్ల నిర్మాణం కష్టంగా మారడం తో.. పాటు నీటి నిల్వ సామర్థ్యం పెంచడం కూడా సమస్యగా ఉండేది. కానీ, ఇప్పుడు దాయాది దేశంతో ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. కొత్త ప్రాజెక్టులతో పాటు నీటి నిల్వను కూడా పెంచే ఛాన్స్ దొరికింది. అయితే, నిర్మాణ ప్రతిపా దనల్లో ఉన్న ప్రాజెక్టుల్లో ఇప్పుడు ఎటువంటి మార్పులు చేయడం లేదన్నారు. ఎందుకంటే వీటికి సంబంధించిన సాంకేతిక అంశాలు ఇప్పటికే పూర్తి అయ్యా యి. మరికొన్ని ప్రాజెక్టులు ప్రారంభ దశలోనే ఉండటంతో.. వాటిల్లో విద్యుత్ ఉత్పత్తిని ఎక్కువగా చేసేందుకు నీటి నిల్వ సామర్థ్యం పెంచడానికి ప్లాన్ చేస్తున్నామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చెప్పుకొచ్చారు.అయితే, ప్రస్తుతం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ జమ్మూ కాశ్మీర్‌లో నాలుగు హైడ్రో ఎ లక్ట్రిక్ ప్రాజెక్టుల ఏర్పాటు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ, ఇవి ఇంకా నిర్మాణ పనులను స్టార్ట్ చేయాల్సి ఉంది. వీటిల్లో సింధు నదిపై న్యూ గందర్బాల్ ప్రాజెక్టు, చీనాబ్‌పై కిర్తాయ్–2, సవల్‌కోట్, జీలంపై ఉరి–1,2 ప్రాజెక్టులు రెడీగా ఉన్నాయి. కాగా, 1960 సెప్టెంబరులో సింధు, దాని ఉప నదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో అప్పటి భారత ప్రధాని జవ హర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌లు దీనిపై సంతకాలు చేశారు.

## సంపాదకీయం

**శుక్రవారం 13-06-2025**

# బడిగంటలు మోగే వేళ..సమస్యల గుదిబండ !

నేటినుంచి బడగంటలు మోగనున్నాయి. పాతవాసనలే ఇంకా గుప్పుమంటున్నాయి. అనేక సమస్యలు ఉన్నా కనీస సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. కిలో రూపాయి బియ్యం, పెన్షన్ల పంపిణీల మీదున్న శ్రద్ధ..పాఠశాలలను బాగుచేసే విషయంలో మాత్రం కానరావడం లేదు. ఈ క్రమంలో గతేడాదికి నేటికి ఏమైనా మార్పులు గోచరించాయా లేదా అన్నది స్కూళ్లకు వెళ్లే టీచర్లను, పిల్లలను అడిగితేనే తెలుస్తుంది. అయితే పాలకుల ప్రకటనల్లో ఉన్న శ్రద్ధ కార్యాచరణలో మాత్రం లేదనే చెప్పాలి. ప్రభుత్వ బడులు బాగా పడ్డాయంటే ప్రైవేట్ స్కూళ్లకు గిరాకీ తగ్గాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు ఉత్సాహంగా పంపుతున్నారా లేదా అన్నది చూడాలి. దేశ భవిష్యత్ అంతా స్కూళ్లలోనే ఉంది. అవి బాగుపడితేనే దేశం బాగుపడుతుందన్న విషయంలో పాలకులకు పట్టడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఏర్పడ్డ ప్రభుత్వాలు ఏడాది పూర్తి చేసుకున్నాయి. ఈ యేడాదిలో తము ఏమైనా మార్పు చేసామా లేదా అన్నది వారే చెప్పాలి. వేసవి సెలవులు తరవాత గురువారం పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో స్కూళ్లపై శ్రద్ధ పెడతారా అని తల్లిదండ్రులు ఆశగా చూస్తున్నారు. 12నుంచి స్కూళు ప్రారంభం కాబోతున్నాయి. ప్రైవేట్ స్కూళ్లను పలుచోట్ల ఇప్పటికే ప్రారంభించారు. ఫీజులను ముందే వసూలు చేసుకుంటున్నారు. కొన్ని స్కూళ్లు ఫీజులను వసూలు చేశాక మెల్లగా నెలాఖరు వరకు ఆన్‌లైన్ క్లాసులంటూ విద్యార్థుల తల్లిదండ్రుకు చెప్పారు. బడిబాట పేరుతో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూళ్ల పై నియంత్రణ కోల్పోయాయి. బడిబాటను మొక్కుబడిగా గాకుండా పక్కాగా నిర్వహించి, పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలి. ప్రైవేట్ యాజమాన్యాలు ఇచ్చే ఆమ్యామ్యాలే వారికి ముఖ్యం కనుక అధికారులు కార్పోరేట్లపై ఈగ వాలకుండా చూసుకుంటున్నారు. నిజానికి వారు చట్టం పరిధిలో ఉన్నారా అన్న అనుమానాలు కూడా కలగమానదు. ఇక సర్కార్ బళ్లల్లో ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యులు ఏటా ఉండనే ఉంటున్నాయి. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం ప్రభుత్వాలు నడుంబిగించాలి. కేంద్రం కూడా విద్యారంగానికి ఉదారంగా కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతోనే కార్పోరేట్ స్కూల్లకు కళ్లెం వేయగలం. తామంతా సర్కార్ బడుల్లోనే చదివామని, స్కూళ్లను ఆధునీకరిస్తామని, డిఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కొంత ఊరటనిచ్చేదిగా ఉన్నా, ఆచరణలో మాత్రం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉంది. ఎపిలో కూడా విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా పాఠశాలల బలోపేతానికి అనేక హామీలు ఇచ్చారు. తెలంగాణలో పాఠశాలల ఆధునీకరణకు 2వేల కోట్లు కేటాయిస్తామని సిఎం అన్నారు. గతంలో ఎపిలో ఆంగ్ల మాధ్యమం పేరుతో, నాడునేడుతో జగన్ హడావిడి చేసినా.. క్షేత్రస్థాయి లో పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదు. ఈ క్రమంలో దశలవారీగా స్కూళ్లను ఆధునీకరించాలి. మౌలిక వసతులు కల్పించాలి. విద్యపై పెట్టుబడి దేశ సంపద అన్న సిఎం రేవంత్ మాటను నిలబెట్టుకుని చిత్తశుద్ధితో పని చేయాలి. పాఠశాల విద్యను ఎంతగా బలోపేతం చేస్తే సమాజం అంతగా బలోపేతం అవుతుంది. మంచి సమాజాం ఏర్పడడానికి పునాది పడుతుంది. విద్యకు ఎన్నివేల కోట్లు ఖర్చు చేసినా.. అది భవిష్యత్ పెట్టుబడిగానే చూడాలి. అనవసర పథకాలకు దుబారా చేసేకన్నా విద్య,వైద్యంపై శ్రద్ధ పెట్టి నిధులు కేటయిస్తే మంచిది. ఇలా చేయడం కోసం ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కృషి చేయాలి. ఆరోగ్యశ్రీ పేరుతో కార్పోరేట్ స్కూళ్లకు వందలకోట్లు తగలెయ్యడం మానకుకోవచ్చు ప్రాథమికి ఆరోగ్య కేంద్రాలను, స్కూళ్లను బలోపేతం చేసేందుకు అడుగులు వేస్తేనే మంచిది. దీంతో కార్పోరేట్ స్కూళ్ల దోపిడీ నుంచి తల్లిదండ్రులు బయటపడగలరు. కార్పోరేట్ స్కూళ్లు ముక్కుపిండి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా నియంత్రణ లేకుండా పోయింది. ఏ అధికారి కూడా వారివైపు కన్నెత్తి చూడడం లేదు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నా..అడపాదడపా తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు కిమ్మనకుండా ఉన్నాయి. కెజి టూ పిజి ఉచిత విద్యను అందించడానికి ప్రయత్నాలు సాగాలి. అలాగే పుస్తకాల ముద్రణ ఇంకా కొలిక్కి రాలేదు. ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. తెలంగాణలో గత కెసిఆర్ ప్రభుత్వ నిర్వాకం వల్ల వేలాది స్కూళ్లు మూతపడ్డాయి. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగానే చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవు తోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట లేకుండా చేయాలి. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీ భాషలు నేర్పితే సరిపోతుంది. ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదంగా..దేశంలో జాతీయో ద్యమంగా సాగాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్లపై అజమాయిషీ చేయాలి. డబ్బులు గుంజే విధానాన్ని అరికట్టాలి. వారు చట్టానికి లోబడి ఉండేలా చూడాలి. అంతేగాని వారిని పట్టించుకోకుండా.. వసూళ్లు చేసుకునేలా ప్రోత్సహించడం అరాచకం తప్ప మరోటికాదు. ఫీజుల నియంత్రణపై వేసిన కమిటీలు ఇచ్చిన సూచనలు బుట్టదాఖలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. సర్కార్ బడులను నిజగానే బలోపేతం చేసి, బోధానా సిబ్బందిని నియమించి, మౌలిక వసతులు కల్పిస్తే ప్రజలు తప్పకుండా సర్కార్ బడులనే ఆశ్రయిస్తారు. విద్యారంగానికి పూర్వ వైభవం కూడా వస్తుంది.

# అమరావతి రాజధానిని ఫ్రీ జోన్ గా ప్రకటిస్తారా ?



అమరావతి,ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతి ఉంది. ఇది ఇపుడు సుస్పష్టమైంది. అమరావతి రాజధాని విషయంలో ఎవరికీ ఏ విధమైన పేచీ పూచీలు లేవు. ఏపీకి మంచి రాజధాని కావాలని అయిదు కోట్ల ప్రజానీకం బలంగా కోరుకుంటున్నారు. అయితే అమరావతి రాజధానిని అంతా సమర్ధిస్తూనే మరో వైపు ఏపీలో ఉన్న ఇతర నగరాలు టైర్ టూ సిటీలను అభివృద్ధి చేయాలని వికేంద్రీకరించాలని సూచిస్తున్నారు.తెలంగాణాకు కానీ దేశంలో చాలా రాష్ట్రాలకు కానీ లేని సదుపాయం ఏపీకి మాత్రమే ఉందని గుర్తు చేస్తున్నారు. ఏపీలో పది లక్షలు దాటిన జనాభాతో మెట్రో సిటీలుగా విశాఖ, విజయవాడ ఉన్నాయి. అలాగే పది లక్షల లోపు జనాభాతో కాకినాడ, తిరుపతి, రాజమండ్రి వంటి నగరాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు ఇక అయిదు లక్షల జనాభా కలిగిన నగరాలు కూడా ఏపీలో మరో పది దాకా ఉన్నాయని వీటిని అన్నింటినీ అభివృద్ధి చేస్తే కనుక ఏపీలో ఏకంగా అమరావతి రాజధానితో పాటు మరో పదిహేను నగరాలు కూడా జత కలిసి గ్రోత్ ఇంజన్లు అనేకం వస్తాయని అంటున్నారు.ఇక ఏపీలో నాలుగు జోన్లను ఏర్పాటు చేశారు. అవి ఉత్తరాంధ్రా, కృష్ణా ఉభయ గోదావరి, ఇక గుంటూరు, నెల్లూరు, ప్రకాశం ఒక జోన్ గా, రాయలసీమ నాలుగు జిల్లాలూ మరో జోన్ గా విభజించారు అయితే అమరావతి జోన్ త్రీలో ఉంది. దాంతో అమరావతి అభ్ధివృద్ధి ఫలాలు ఏపీలో మొత్తం పదమూడు ఉమ్మడి జిల్లాలకూ అందాలంటే కనుక ఫ్రీ జోన్ గా ప్రకటించాలని కోరుతున్నారు. అంటే అమరావతి రాజధానిలో విద్యా ఉపాధి అవకాశాలకు ఏపీలో మొత్తం జనాభా అంతా పోటీ పడేలాగానూ వాటిని అందుకునేలాగానూ ఈ అవకాశం ఇవ్వాలని అంటున్నారు.లేకపోతే మిగిలిన ప్రాంతాలు వివక్షకు గురి అయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు దీని మీద కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తులసీ రెడ్డి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా చేస్తేనే ఏపీలో మొత్తం యువతకు ఉపాధి విద్య అవకాశాలకు మంచి చాన్స్ ఉంటుందని అన్నారు. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ రాజధానిని ఫ్రీ జోన్ గా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు.అమరావతి విషయంలో కూడా కూటమి ప్రభుతం ఈ తరహాలో నిర్ణయం తీసుకోవాలని అన్నారు. మరి దీనిని కూటమి ప్రభుత్వం ఏ విధంగా అమలు చేస్తుందో చూడాల్సి ఉంది. రానున్న కాలంలో అమరావతి మీద పూర్తి ఫోకస్ ఉంటుంది. అంతే కాదు అక్కడే పరిశ్రమలు వస్తాయి, విద్యా సంస్థలు పెద్ద ఎత్తున వస్తాయి, అందువల్ల ఫ్రీ జోన్ పెడితే ఎవరైనా లబ్ది పొందుతారు అన్నదే మేధావుల సూచనలుగా ఉన్నాయి.

# 'తొక్కిసలాట'పై తొండాట

బెంగళూర్ :పదిహేడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం అనుకోకుండా ఐపిఎల్ కప్ సాధించుకున్న ఆర్‌సిబికు ఆ మరుసటి రోజే విజయోత్సవాల సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడంతో ఆ ఉత్సాహం అంతా నీరుగారిపోయింది. ఇటువంటి విషాదకర ఘటన నివారింపదగిందే అయినప్పటికీ సంబంధీకులు అందరూ బాధ్యతారహితంగా వ్యవహరించడంతో జరిగినట్లు స్పష్టం అవుతుంది. అందుకనే ఈ తొక్కిసలాటకు తామంటే తాము బాధ్యులం కామని అందరూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా నలుగురు ఈ ఘటనకు బాధ్యులని పేర్కొనవచ్చు. ప్రభుత్వం, పోలీసులు, ఆర్‌సిబి, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్. మొదటగా నగర కమిషనర్‌తోపాటు కొందరు పోలీసు అధికారులపై వేటు వేయడం, బదిలీ చేయడం ద్వారా వారిపై నెపం రుద్దే ప్రయత్నం ప్రభుత్వం చేసింది.కానీ, స్పష్టంగా మరుసటి రోజే సంబరాలకు తొందర ఎందుకు, రెండు రోజులు ఆగమని పోలీసులు స్పష్టం చేసినట్లు వెల్లడి అవుతున్నది. ముఖ్యంగా విధానసౌద్ నుండి చిన్నస్వామి స్టేడియం వరకు ర్యాలీ జరపవద్దని స్థానిక డిసిపి లిఖితపూర్వకంగా ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకే పోలీస్ కమిషనర్ ముఖ్యమంత్రి వద్దకు వెళ్లిన సందర్భంగా ఆ రోజు సంబరాలు జరిపితే జనాన్ని నియంత్రించడం కష్టం అని స్పష్టం చేశారు. అయితే, సిఎంఒ నుండి ఒక అధికారి, మరో వంక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ (%ణఖ రాష్ట్రఅఋుఎబమ్రితీ%) ల ద్వారా ఆర్‌సిబి ఒత్తిడి తెచ్చినట్లు చెబుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ఉదయం 7 గంటలకే సంబరాల గురించి, ర్యాలీ గురించి సోషల్ మీడియా ద్వారా ఆర్‌సిబి ప్రకటించింది.ర్యాలీ లేదని 12 గంటలకు ట్రాఫిక్ విభాగం ప్రకటించినా, 1 గంటకు కూడా ఉందంటూ ఆర్‌సిబి ప్రచారం చేసింది. వాస్తవానికి అంత తొందరగా మరుసటి రోజే సంబరాలు జరుపుకోవాల్సిన అవసరం లేదు. కప్ గెలుస్తామని ముందుగా అంచనాలు లేకపోవడంతో, సంబరాలకు సన్నాహాలు ముందుగా చేసుకున్న దాఖలాలు లేవు. అనుకోకుండా కప్ రావడంతో భావోద్వేగంతో ఇటువంటి సంబరాలకు సిద్ధపడినట్లు కనిపిస్తున్నది. అయితే, ఈ విషయంలో పోలీసులతో కలసి సన్నాహాలు చేసుకొనే ప్రయత్నం చేయాల్సింది. ఆర్‌సిబి ఇప్పటివరకు కప్ గెలవలేకపోయినా దేశంలో మరే ఐపిఎల్ టీం కు లేనంతటి క్రేజ్ సంపాదించుకుంది. అందుకు మొదట్లో విజయ మాలవ్య, ఆ తర్వాత సారథులు విరాట్ కోహ్లీకున్న క్రేజ్ ను ఆసరా చేసుకొని మార్కెటింగ్ చేసుకోవడమే కారణం.అందుకనే ఎప్పుడూ కప్ గెలవలేకపోయినా వ్యాపారపరంగా ముంబై, చెన్నై, కలకత్తాలకు మించి స్పాన్సర్స్‌ను సంపాదించి భారీగా ఆదాయం పొందుతున్నారు. ఆదాయం మీదున్న ఆసక్తి సంబరాల నిర్వహణకు తగు ప్లాన్ చేయడం లేకపోవడంతో ఇటువంటి దుర్ఘటన చోటుచేసుకుంది. పైగా, ఈ మధ్య కాలంలోనే కుంభమేళా సందర్భంగా భయంకరమైన తొక్కిసలాట జరిగింది. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో, ఆ తర్వాత హైదరాబాద్‌లో పుష్ప-2 విడుదల సందర్భంగా జరగడం చూసాం. అటువంటి అనుభవాల నుండైనా గుణపాఠాన్ని గ్రహించే ప్రయత్నం ఆర్‌సిబి, కర్ణాటక ప్రభుత్వం, పోలీసులు చేయలేదు. పోలీసు అధికారులు చెప్పినట్లు మరో రెండు రోజుల తర్వాత సంబరాలు జరిపితే ప్రశాంతంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, మరుసటి రోజు జరపడంతోనే తొక్కిసలాట జరిగిందని అంటూ తమ బాధ్యతలను నిరాకరించే ప్రయత్నం చేయడం క్షంతవ్యం కాదు.గతంలో అంబరీష్, పునీత్ రాజ్‌కుమార్ వంటి నటుల మృతి సందర్భంగా కూడా పెద్ద ఎత్తున అభిమానులు తోసుకొంటూ వచ్చినప్పటికీ ఎటువంటి అవాంఛనీయ ఘటనకు ఆస్కారం లేకుండా చూసిన ఘనత బెంగళూరు పోలీసులకు ఉందని మరవలేం. వేడుక జరిగిన చిన్నస్వామి స్టేడియంతో తమకు సంబంధం లేదన్నట్లు పోలీసులు వ్యవహరించారు. దానికి 20 గేట్లు ఉంటే కేవలం మూడు మాత్రమే తెరవడంతో, ఒక గేటు వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. వెంటనే జోక్యం చేసుకొని, మరికొన్ని గేట్లను తెరిపించి ఉంటే ప్రమాదం కొంతవరకు అదుపులోకి వచ్చి ఉండెడిది. ఈ విషయంలో క్రికెట్ అసోసియేషన్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పాలి.తొక్కిసలాట దృశ్యాలను చూస్తే నిర్వహణ, భద్రతా వైఫల్యాలు, నిఘా లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఘటన తీవ్రత రీత్యా రాష్ట్ర హైకోర్టు సైతం సుమోటోగా స్వీకరించి తక్షణ విచారణ ప్రారంభించి సంధించిన ప్రశ్నలు ఈవెంట్ నిర్వహణలో లోపాలను ప్రాథమికంగా నిర్ధారించేవిగా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించైనా నేరుగా సమాధానాలు ఇవ్వకుండా ఇతరులపై నెపం నెట్టివేసే ప్రయత్నాలు కనిపించాయి. ఆర్‌సిబి కప్ గెలవగానే ఆ రాత్రి అంతా లక్షలాది మంది ప్రజలు బెంగళూరు వీధులలో సంబరాలు చేస్తూ కనిపించారు. పోలీసులు సైతం వారిని అదుపు చేస్తూఅలసిపోయినట్లున్నది. అందుకనే మరుసటి రోజే విజయ సంబరాలు అంటూ ఆర్‌సిబి సోషల్ మీడియా ద్వారా ప్రకటించగానే ఉదయంనుండే జనం రహదారులపైకి చేరుకోవడం ప్రారంభమైనది. పైగా, రాత్రి సంబరాలలో తక్కువగా ఉన్న మహిళలు పగలు పెద్ద సంఖ్యలో రావడం, సంబరాల నిర్వహణకు పోలీసులు, ప్రభుత్వంతోపాటు ఆర్‌సిబి సైతం ఎటువంటి సన్నాహాలు చేయకపోవడంతో తొక్కిసలాట అనివార్యంగా మారింది. అందుకు అందరూ బాధ్యత వహించాల్సిందే.పోలీసులు కనీసం బారికేడ్లు కూడా ఏర్పాటు చేయకపోవడం, అంబులెన్సులు అందుబాటులో లేకపోవడం వంటివి నేరమయ నిర్లక్ష్యాన్ని వెల్లడి చేస్తున్నాయి. పైగా, ఒక వంక స్టేడియంలో సంబరాలు అని ప్రకటించి, మరోవైపు విధాన సౌద్‌లో



ప్రభుత్వం ప్రత్యేకంగా ఎందుకు సన్మానం చేయాల్సి వచ్చింది? దాని కారణంగా అభిమానులు అంత పెద్ద సంఖ్యలో క్రీడాకారుల బస్సును వెంబడిస్తూ తిరగడం జరిగింది. సంబరాలు ప్రభుత్వ కార్యక్రమం కాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేసినా, ప్రభుత్వంలోని పలువురు పెద్దలు హద్దుమీరి ఉత్సాహం చూపడం జరిగింది. అయితే, తగు జాగ్రత్తలు తీసుకోవడంలో అటువంటి ఆసక్తి కనబరచలేదు. అయితే, ఈ తొక్కిసలాట సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించిందని మెచ్చుకోవలసిందే. కుంభమేళా తొక్కిసలాటలో అసలేమీ జరిగిందో ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించలేదు.కనీసం మృతుల జాబితాను సైతం బహిరంగపరచలేదు. ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాట సమయంలో సైతం మృతుల కుటుంబాలకు అక్కడనే నగదు పరిహారం అందజేసి, ఎవ్వరికీ కనిపించకుండా వారిని పంపే ప్రయత్నం చేశారు. మృతుల జాబితా బయటకు రాకుండా చూసారు. కానీ స్వయంగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆసుపత్రులకు వెళ్లి పరామర్శలు చేయడమే కాకుండా, సాయంత్రం 7.30 గంటలకల్లా మృతుల జావితాను ప్రకటించారు. తొలుత కొంత గందరగోళం జరిగినా వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. ఈ విషయంలో మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం కూడా కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో కీలకమే కాకుండా, పరిస్థితుల తీవ్రత మరింతగా దిగజారకుండా కాపాడేందుకు దోహదపడుతుంది.ఈ సందర్భంగా ఐపిఎల్ మొత్తం క్రికెట్‌ను ఓ జూదంగా మార్చివేసిందని, కార్పొరేట్ కంపెనీల వ్యాపార ప్రక్రియగా మార్చివేసిందనే విమర్శలు ఈ సందర్భంగా వస్తున్నాయి. అసలైన క్రీడా స్ఫూర్తికి ఆస్కారం లేకుండా చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. అసలు క్రికెట్‌కు సంబంధం లేనివారు, ఎప్పుడూ క్రికెట్ బ్యాట్ కూడా పట్టుకొని వారు బిసిసిఐలో, ఐపిఎల్ టీంల నిర్వహణలో కీలకంగా మారి, వారే నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందనే ఆందోళనలు కూడా వ్యక్తం చేస్తున్నాయి. ఏదేమైనా క్రికెట్ నేడు ఓ కీలకమైన వినోదంగా మారిందని గుర్తించాలి. సినిమా తారలకు మించి కొందరు క్రికెట్ క్రీడాకారుల పట్ల జనంలో క్రేజ్ కనిపిస్తున్నది. క్రికెట్ కారణంగా మిగిలిన ముఖ్యమైన ఆటలకు స్పాన్సర్లు దొరకడం లేదని, ఆయా క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం లభించడం లేదని కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ, వందల సంఖ్యలో యువకులు నూతనతరం క్రికెట్ క్రీడాకారులుగా వెలుగులోకి వచ్చేందుకు ఐపిఎల్ దోహదపడుతుందని మరచిపోలేం.క్రికెట్ క్రీడాకారులు సైతం నేడు భారీ ఆదాయాలు పొందుతున్నారు. పైగా ఐపిఎల్‌లో రాణించిన వారు భారత దేశ జట్టులో చేరుతూ ఉండడంతో అంతర్జాతీయంగా భారత జట్టు గతంలో ఏనాడూ లేని విధంగా విజయాలు సాధిస్తూ వస్తున్నది. కార్పొరేట్ రంగంలోని వారు ఐపిఎల్‌ను సైతం ఓ వ్యాపారంగా మార్చివేస్తున్నప్పటికీ యువతకు ఇంతటి ప్రోత్సాహం అందించేందుకు దోహదం చేయడాన్ని ఎందుకు నిరాకరించాలి? ముంబై, చెన్నై జట్లు అనేక పర్యాయాలు ఐపిఎల్ కప్‌లు గెలుచుకున్నాయి. వారు కూడా సంబరాలు జరుపుకున్నారు. అయితే అక్కడెక్కడా బెంగళూరులో మాదిరిగా భావోద్వేగాలు ఇమిడిలేకపోవడం గమనించాలి. ప్రపంచ కప్ గెలిచినా ముంబైలో ఇంతటి భావోద్వేగం ప్రదర్శించే ప్రయత్నం చేయలేదు. లక్షల సంఖ్యలో జనం రోడ్లపైకి వచ్చినా ఓ సాధారణమైన అంశంగా చాలా ప్రశాంతంగా సంబరాలు జరుపుకోవడాన్ని చూసాం. చివరకు ఆయా జట్ల క్రీడాకారులతో సైతం భావోద్వేగాలు అంతగా కనిపించేవి కావు. కానీ బెంగళూరులో ముందుగా క్రీడాకారులు తీవ్రమైన భావోద్వేగానికి గురయ్యారు. విరాట్ కోహ్లీ అహ్మదాబాద్ స్టేడియంలోని కన్నీటితో భావోద్వేగానికి గురికావడం ద్వారా మొత్తం కర్ణాటక ప్రజలను భావోద్వేగంతో నింపివేసారు. ఎందుకంటే, ప్రతి ఏడాది 'ఈ సారి కప్ మాదే' అంటూ హడావుడి చేయడం, చివరకు బొక్కబోర్లా పడుతూ రావడంతో ఓ విధమైన నైరాశ్యంలో చిక్కుకున్న ఆర్‌సిబి జట్టుకు మాత్రమే కాకుండా మొత్తం కర్ణాటక ప్రజలకు తీవ్రమైన భావోద్వేగమైన అంశంగా మారింది. కేవలం బెంగళూరు నుండే కాకుండా మొత్తం కర్ణాటక నుండి అభిమానులు పెద్దసంఖ్యలో రావడం, ఆ రీతిలో సన్నాహాలు జరగకపోవడంతో ఇటువంటి తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటను ఓ గుణపాఠంగా స్వీకరించి, దేశంలో ఐపిఎల్ జట్లు అన్ని ఇక ముందు జాగ్రత్త వహించాలి. ఓ జట్టు ఫైనల్‌కు దగ్గరగా జరిగినప్పుడే కప్ సాధిస్తే సంబరాలు ఏవిధంగా జరపాలో ముందుగా ఓ ప్రణాళిక తయారు చేసుకొని విధంగా చూడాలి.

# కాళేశ్వరం,ధరణి,మిషన్ భగీరథ పెద్ద స్కామ్‌లు

ములుగు, గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని, ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర కమిషన్ రిపోర్ట్ వచ్చాక చట్టపరమైన చర్యలు తప్పవని, ఎంత పెద్దవాళ్లు ఉన్నా వదలబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం విచారణలో ఎలాంటి రాజకీయ కక్ష వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. కమిషన్ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగానే.. అందులో ఎవరి పాత్ర ఉంటే వారిపైనే చర్యలు ఉంటాయన్నారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని పొంగులేటి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు అంశాల్లో దోచుకోవడం పెట్టుకున్నారు. కాళేశ్వరాన్ని ఎనిమిదవ వింతగా చూపించారు. గొప్ప ప్రాజెక్టుగా చెప్పిన కాళేశ్వరం వాళ్లున్న (బీఆర్ఎస్) సమయంలోనే కూలిపోయింది. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కాళేశ్వరంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కాపాడే ప్రయత్నం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేసారు. రాష్ట్ర సంస్థలతో విచారణ జరిపితే పొలిటికల్, తప్పుడు ప్రచారాలు జరుగుతాయని కేంద్ర సంస్థతో విచారణ చేపట్టారు. కాళేశ్వరం నిర్మాణంలో ఉన్న లోపాలు బయటపడ్డాయి. ప్రాజెక్టు పేరుతో పింక్ కలర్ కుట్రని ఛేదించేందుకు కమిషన్‌ని నియమించింది. కేంద్ర సంస్థ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా జడ్జితో కమిషన్ వేసి పూర్తి వివరాలు తెలుసుకుంటూ ఉంటే.. దాన్ని తప్పు పట్టే ప్రయత్నం చేస్తున్నారు. తనకు తాను తెలంగాణ జాతిపితగా చెప్పుకునే పెద్ద మనిషి కూడా విచారణ హాజరు కావాల్సి వచ్చిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. 'కమిషన్ రిపోర్టు ఆధారంగా వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి. పేదోడు సొమ్ము తిన్న వాళ్లు ఎంత పెద్ద వాళ్లు ఉన్నా చట్టం తన పని తాను చేసుకుపోతుంది. కాళేశ్వరం విచారణలో ఎలాంటి రాజకీయ కక్ష వేధింపులు ఉండవు. కమిషన్ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగానే ఇందులో ఎవరి పాత్ర ఉంటే వారిపైనే చర్యలు ఉంటాయి. మిషన్ భగీరథలో దోచుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ భూములు అమ్ముకున్నారు. ఒక్కదాని తర్వాత మరొక దానిపై విచారణలు ఉంటాయి. ఇప్పుడు కాళేశ్వరంపై విచారణ కొనసాగుతుంది. వీటన్నింటితోటే ముడిపడిన అంశం ఫోన్ టాపింగ్. అందులో కూడా విచారణ జరుగుతుంది. అసలైన దోషులు ఎవరో త్వరలోనే తేలుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## సూపర్ సిక్స్ హామీల్లో మరో పథకం

అమరావతి,తల్లులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో ముఖ్యమైన పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా గురువారం తల్లులకు కానుకగా తల్లికి వందనం నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. జూన్ 12న తల్లికి వందనం నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద వారివారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయనుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం అర్ధరాత్రి నుంచే నిధులు విడుదల కానున్నాయి. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకూ తల్లికి వందనం పథకం అమలు కానుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా తల్లులకు కానుకగా తల్లికి వందనం ఇవ్వనుంది ప్రభుత్వం.. ఈ మేరకు సీఎం చంద్రబాబు.. తల్లికి వందనంపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు వారి ఖాతాల్లో జమ చేయనుంది. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారు.. విధి విధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.. కాగా, సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు తల్లికి వందనం అమలుపై నిర్ణయం తీసుకుంది..

## రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

విజయవాడ,వ్యవసాయ ప్రధానమైన ఎన్ టి ఆర్ జిల్లాలో ఏరువాక పౌర్ణమి పండుగను బుధవారం జిల్లా కలెక్టరు డాక్టర్ జి. లక్ష్మీశా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో అన్నదాతల మధ్య ఎంతో ఉత్సాహంగా, ఘనంగా, సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ సౌభాగ్యానికి, ఆరోగ్య భాగ్యానికి పునాదిరాళ్ళు ఆరుగాలం శ్రమించే రైతన్నలు. అలాంటి రైతు కష్టమే మన కడుపులు నింపుతోంది. రైతులు ఎప్పటి కప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటూ, పశువుల ఎరువు లేదా పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా నేల తల్లియొక్క ఉత్పత్తి సామర్థ్యాన్ని పదిల పరచుకుంటూ, భూసార పరీక్షానుసారం అవసరం మేరకు మాత్రమే ఎరువులు వాడుకుంటూ మరియు పురుగు మందులు వాడకంలో విచక్షణ పాటిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ , ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందటంతో పాటు- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని సూచించారు. అదే విధంగా వైవిధ్యమైన పంటలతో పాటు-, కూరగాయలు మరియు పండ్లకు ప్రాముఖ్యత ఇచ్చిన-ట్ల÷టైతే వ్యవసాయం మరింత లాభసాటిగా ఉంటుంది అని తెలియజేశారు. వ్యవసాయంతో పాటు పశు పోషణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ప్రధాన పంట వేసుకొనే ముందు నేలలో నవ ధాన్యాలు లేదా వైవిధ్యమైన అంతకన్నా ఎక్కువ రకాలు చల్లుకొంటే నేల ఆరోగ్యంతో పాటు- రైతుకు కొంత లాభసాటిగా ఉంటు-ందని సూచించారు. వ్యవసాయకూలీల కొరతను ఎదుర్కొంటు-న్న ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో డ్రోన్ల యొక్క అవసరాన్ని మరియు ఉపయోగాలను సవివరంగా రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మైసమ్మతల్లి ఆగ్రోఫామ్ , జక్కంపూడి మరియు అమరావతి కిసాన్ డ్రోన్ గ్రూపు, రాయనపాడు సభ్యులకు కలెక్టరు గారి చేతుల మీదుగా 80??? రాయితీపై డ్రోన్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి. యమ్. ఎఫ్ విజయకుమారి, జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజనుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని


# రాజగోపాల్ రెడ్డి అభిమానుల ఆందోళన

నల్గొండ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో ఆయన అభిమానులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. కావాలనే పదవి రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ క్రమంలో చండూరులో ఇద్దరు యువకులు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే.. తాము వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకేస్తామంటూ వారు బెదిరించారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని.. వారిని కిందకు దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తనకు మంత్రి పదవి రాకపోవడంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం స్పందించారు. కొత్తగా మంత్రి పదవులు పొందిన ఎమ్మెల్యేలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే.. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాను. ఈ రోజు నేను మంత్రిగా లేక పోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పని చేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నానన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను ఇటీ-వల పునర్వ్యవస్థీకరించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు కొత్త వారికి ఆ కేబినెట్‌లో చోటు కల్పించారు. అయితే ఈ కేబినెట్‌లో తమకు చోటు దక్కుతోందంటూ పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు ఆశించారు. కానీ వారికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో వారంతా తీవ్ర నిరాశ చెందారు. ఆ క్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తోపాటు- మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు.. సదరు ఆశావాహుల ఇళ్లకు వెళ్లి బుజ్జగించిన సంగతి తెలిసిందే. ఇక ఈ జాబితాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం ఉన్నారు. ఆయన కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆయన్ని సైతం పార్టీ పెద్దలు బుజ్జగించినట్లు- సమాచారం. అదీకాక రేవంత్ రెడ్డి కేబినెట్‌లో పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గాల సమీకరణాల దృష్ట్యా వివిధ వర్గాల వారికి ఈ కేబినెట్‌లో చోటు- కల్పించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. అందులోభాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురికి కేబినెట్‌లో చోటు- కల్పించింది. ఇంకోవైపు రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మరో మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో భర్తీ చేసే అవకాశముందని పార్టీ వర్గాల్లో ఒక చర్చ అయితే నడుస్తోంది.

# ఆకట్టుకున్న వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగా

విజయవాడ,తొలి జాము నుంచి చిరు జల్లులు సవ్వడి చేస్తూ కృష్ణా తీరం ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది. నగరంలోని బెరం పార్కు వద్ద కృష్ణమ్మ తీరం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నేతృత్వంలో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా మెగా ఈవెంట్‌లో పాల్గొనేందుకు యోగా ప్రియులు విశేషంగా తరలిరావడంతో పులకించింది. బుధవారం ఉదయాన్నే బెరం పార్కుకు చేరుకున్న పార్లమెంటు- సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఏడీ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రలకు యోగా ప్రియులు హర్షధ్వానాలతో స్వాగతంపలికారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన యోగా ఔత్సాహికులు పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు- వంటి 201 వాటర్ క్రాఫ్టులపై వెయ్యిమంది, నదీ తీర ప్రాంతంలో ఏర్పాటు-చేసిన పచ్చని తివాచీలపై మరో వెయ్యి మంది యోగాసనాలు ఆచరించడంతో కృష్ణమ్మ ఒడి పులకించింది. ప్రపంచ రికార్డు సాధించాలన్న జిల్లా యంత్రాంగం ఆశయం నెరవేరింది. యోగాసనాలను ఆద్యంతం నిశితంగా పరిశీలించిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ (డబ్ల్యూఆర్‌యూ) న్యాయనిర్ణేత షరీఫ్ హనీఫ్.. యోగా కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు, యోగాసనాలను ఆచరించిన విధానం, తరలివచ్చిన ఔత్సాహికులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రపంచ రికార్డు సాధించినట్లు వేలాది మంది హర్షధ్వానాల మధ్య రికార్డు సాధించినట్లు- ప్రకటించారు. ఓ నదిలో అత్యధిక మందితో వివిధ రకాల అత్యధిక బోట్లపై యోగాసనాలు చేసి ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నట్లు ధ్రువీకరిస్తూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఏడీ-పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, ఎన్‌టీ-ఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంలకు సర్టిఫికెట్ అందించారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వం, ఆయన బృందం అపూర్వ కృషికి ఫలితం ప్రపంచ రికార్డు అని వరల్డ్ రికార్డ్స్ యూనియన్ (డబ్ల్యూఆర్‌యూ) న్యాయనిర్ణేత షరీఫ్ హనీఫ్ పేర్కొన్నారు. క్రమశిక్షణ, సమష్టి కృషి, నిబద్ధత ఫలితంగా పవిత్ర కృష్ణా నదీ తీరం సరికొత్త ప్రపంచ రికార్డుకు వేదికయిందన్నారు. ఇన్నొవేషన్, హెల్త్, ఫిట్‌నెస్‌తో పాటు- పర్యావరణ పరిరక్షణపట్ల జిల్లా అధికార యంత్రాంగం, ప్రజల చిత్తశుద్ధికి ఇది గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐక్యత, శ్రేయస్సు, సంస్కృతీ సంప్రదాయాల పట్ల నిబద్ధతను చాటిచెప్పేలా ఈ రికార్డుతో విజయవాడ ప్రజలు ప్రపంచానికి గొప్ప సందేశాన్ని ఇచ్చారని.. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు- షరీఫ్ హనీఫ్ తెలిపారు. విజయవాడ నగర ప్రజలు ఎంతో చైతన్యవంతులని.. అందరికీ ఆదర్శంగా నిలవాలనే తపన వారిలో కనిపిస్తుందని.. ఆ నిబద్ధత ఫలితమే నేటి ప్రపంచ రికార్డు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, ప్రజల సమష్టి కృషితో రికార్డు సొంతమైందని.. బెరం పార్కు, పున్నమి ఘాట్ వద్ద నదీతీరం గతంలోనూ వివిధ ప్రపంచ రికార్డులకు వేదికగా నిలిచిందని.. గౌరవ ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా 5000 డ్రోన్లతో మెగా డ్రోన్ షోతో ప్రపంచ రికార్డులు సాధించినట్లు- తెలిపారు. ఇదేవిధంగా గౌరవ ప్రధాని సమక్షంలో ఈ నెల 21న విశాఖలోనూ అయిదు లక్షల మందితో యోగాసనాలు ఆచరించి ప్రపంచ రికార్డు సాధించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. యోగా ప్రతిఒక్కరి జీవితాల్లో భాగం కావాలని ఎంపీ శివనాథ్ పిలుపునిచ్చారు. ఆహ్లాదకర వాతావరణంలో ఎన్‌టీ-ఆర్ జిల్లా యంత్రాంగం ఏర్పాటు- చేసిన మెగా యోగా ఈవెంట్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని.. యోగాంధ్ర-2025లో ప్రపంచ రికార్డు సాధించినందుకు ఆనందంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు.

# అప్పుల్లో గురు శిష్యుల పోటాపోటీ! ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే..



హైదరాబాద్,అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడుతున్నామని చెపుతున్న రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. దాని సంగతేమోగానీ.. అప్పులు తేవడంలో మాత్రం తెగ పోటీపడుతున్నట్టు కాగ్ నివేదికలను గమనిస్తే అర్థమవుతున్నది. ఈ రెండు రాష్ట్రాల ఆదాయం గత ఏడాదితో పోల్చితే భారీగా తగ్గిపోయింది. దీంతో అప్పులు చేసి నెట్టుకొస్తున్నారు.

చంద్రబాబు అలా

చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఒక్క ఏప్రిల్ నెలలోనే (ఆర్థిక సంవత్సరం తొలి నెల) రూ.13,837.59 కోట్ల బడ్జెట్ అప్పులు చేసింది. రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.2,110 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చే గ్రాంట్లు రూ.316.88 కోట్లు కలిపి రూ.10,538.38 కోట్ల ఆదాయం ఏప్రిల్‌లో వచ్చింది. ఈ మొత్తం కలిపి రూ. 24,377.15 కోట్లను సమీకరించిన చంద్రబాబు సర్కారు ఇందులో నుంచి రూ.3058.48 కోట్లు వడ్డీకి, రూ.2230,85 కోట్లు అసలు చెల్లింపులకు సరిపెట్టారు. క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పైన రూ.81.32 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గమనార్హం. రూ. 81 కోట్లతో రెండు కిలోమీటర్ల రోడ్డు కూడా వేయడం కష్టం. ఈ లెక్కన ఎన్నిసంవత్సరాలు బడ్జెట్ కేటాయిస్తే అభివృద్ధి జరుగుతుందని సీనియర్ జర్నలిస్ట్ ఒకరు ప్రశ్నించారు. క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌కు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించకుండా మౌలిక సదుపాయాల కల్పన ఏవిధంగా జరుగుతుందన్న ప్రశ్నఆర్థిక నిపుణుల్లో వ్యక్తం అవుతున్నది. అలాగని ఏపీలో ప్రజలకు ఇచ్చిన సబ్సిడీలు కూడా పెద్దగా కనిపించడం లేదు. ఏప్రిల్ నెలలో సబ్సిడీల కింద చంద్రబాబు ఖర్చు చేసింది రూ.2447. 45 కోట్లు మాత్రమే.

రేవంత్ ఇలా

రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.5230.99 కోట్ల అప్పు చేసింది. అలాగే రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.1096.31 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చే గ్రాంట్లు రూ.68.85 కోట్లు కలిసి రాష్ట్ర ఖజానాకు ఏప్రిల్‌లో రూ.11,239.13 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ మొత్తం కలిపి16,473 కోట్లు సమీకరించిన సర్కారు.. ఇందులో నుంచి వడ్డీల కింద రూ. 2260.74 కోట్లు, సబ్సిడీల కింద 4,187.73 కోట్లు ఖర్చు చేసింది. అసలు చెల్లింపులు 7.36 కోట్లతో సరిపెట్టేశారు. క్యాపిటల్ ఎక్స్పెండేచర్ కింద చంద్రబాబు కంటే ఎక్కువగా రూ.1134 కోట్లు ఖర్చు చేయడం నివేదికలో కనిపిస్తున్నది.

మరి కాలేజీ టీడీపీయే కదా!

రేవంత్ రెడ్డి ఇటీవల రవీంద్ర భారతిలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతూ టీడీపీ కాలేజీలో చదువుకున్నానని చెప్పారు. ఆయన ఈ మాట చెప్పక ముందే చంద్రబాబుకు రేవంత్ రెడ్డి శిష్యుడనే వాదనలు, అభిప్రాయాలు, ఆరోపణలు ఉన్నాయి. ఆర్థికంగా తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సీఎంలుగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, రేవంత్‌లకు ప్రభుత్వాలను నడపటం సవాల్‌గా మారింది. ఒకవైపు ఇచ్చిన హామీల అమలు, మరోవైపు కార్యక్రమాలతో ఇద్దరికీ కత్తిమీద సాములా పరిస్థితి తయారైంది. అటు వైఎస్ జగన్ లేదా ఇటు కేసీఆర్ ప్రభుత్వాలు ఎంత ఆదాయం వస్తున్నదనేది పరిగణనలోకి తీసుకోకుండా.. సంక్షేమ పథకాల అమలు పేరుతో అడ్డగోలుగా అప్పులు చేశాయనే విమర్శలు ఉన్నాయి. ఇలా.. అప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. నాటి విచ్చలవిడి అప్పుల ప్రభావం తక్షణమే కనిపించింది. ఫలితంగా చిల్లర ఖర్చులకు సైతం అప్పులు చేసుకోవాల్సిన దుస్థితి రెండు ప్రభుత్వాలకూ దాపురించిందని పరిశీలకులు అంటున్నారు. ఆఖరుకు తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించుకోవడానికి సైతం కొత్తగా అప్పులు చేయాల్సిన దుర్గతి పట్టింది. ఈ క్రమంలోనే గురు శిష్యులిద్దరూ అప్పుల్లో పోటీపడుతున్నారని ఒక జర్నలిస్టు వ్యాఖ్యానించారు.

కలరింగ్‌లు కాదు

అప్పుల్లో పోటీ పడుతున్న బాబు.. రేవంత్‌ల మధ్య మాటల విషయంలో తేడా చాలా స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు అమరావతిని అద్భుతంగా నిర్మిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ ప్రకటించి ఏపీలో ఏదో జరుగబోతున్నదనే భ్రమలు కల్పించే ప్రయత్నాల్లో ఉన్నారనే చర్చ జరుగుతున్నది. మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి తనను కోసినా నయా పైస అప్పు పట్టుడం లేదని బహిరంగంగానే వాపోయారు. తమ ఆర్థిక డిమాండ్లు పరిష్కరించాలన్న ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పరిస్థితిని అర్థం చేసుకోవాలని దాదాపు మొత్తుకున్నంత పని చేశారు.

గత ప్రభుత్వాల్లో పప్పు బెల్లాల్లా నిధుల ఖర్చు

తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోవడం వెనుక గత ప్రభుత్వాల విచ్చలవిడి ఖర్చులు, అప్పులేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అవే ఇప్పుడు ప్రభుత్వాలపై పెను భారంగా పరిణమించాయని చెబుతున్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలు చేసిన గత పాలకులు, బడ్జెట్‌లో చూపించిన వాటి కంటే రెట్టింపుగా బడ్జెటేతర అప్పులు చేస్తుండటం గమనార్హం. ఈ రెండు రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా అధికారులు రిజర్వ్ బ్యాంకుతోపాటు ఇతర ఆర్థిక సంస్థల చుట్టూ తిరిగి అప్పులు సంపాదించే పనిలోనే ఉంటున్నారంటే ఆర్థిక సంక్షోభం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునని ఈ రెండు రాష్ట్రాలను దగ్గరగా పరిశీలిస్తున్న రాజకీయ పరిశీలకుడొకరు అన్నారు. ఈ రెండు రాష్ట్రాలను పాలించిన సమయంలో జగన్, కేసీఆర్ ఇద్దరూ అప్పులు తెచ్చి డబ్బులను పప్పు బెల్లాల్లా పంచి పెట్టారని, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ చేయకుండా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ చేశారని సీనియర్ జర్నలిస్ట్ ఒకరు వ్యాఖ్యానించారు. ఈ రెండు రాష్ట్రాలకు అవే ఇప్పుడు గుదిబండలా మారాయని అన్నారు. ఏపీలో చంద్రబాబు కానీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి లు కానీ అప్పుల జోలికి వెళ్లకుండా ఆదాయం సృష్టించి, వచ్చిన ఆదాయాన్ని ప్రజలకు ఖర్చు చేసే విధంగా పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళ్లాలని ఆర్థిక పరిశీలకులు సూచిస్తున్నారు.

## యశోదాలో పల్లాకు కెసిఆర్ పరామర్శ

హైదరాబాద్,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. కాలు జారి కిందపడటంతో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో పల్లా చికిత్స పొందుతున్నారు. భారాస నేతలతో కలిసి యశోద ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌తో పాటు- మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు భారాస నేతలు పల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన తర్వాత కేసీఆర్ నేరుగా యశోదా ఆస్పత్రికి బయలుదేరి వెళ్లారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కేసీఆర్ పరామర్శించారు. కేసీఆర్ కాళేశ్వరం విచారణ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి సిద్దిపేటలోని ఫాంహౌస్‌కు వెళ్లారు. అయితే అక్కడ ప్రమాదవశాత్తు ఎమ్మెల్యే జారి పడ్డారు. ఈ క్రమంలో ఆయన తుంటి ఎముకలో గాయమైంది. వెంటనే ఆయనను హుటాహుటిన అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు.

# కలకలం : చైనా నుంచి అమెరికాలోకి బయో వెపన్

చైనా:చైనాకు చెందిన పరిశోధకులు అమెరికాలోకి ప్రమాదకరమైన జీవ పదార్థాలను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడుతుండటం తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల మిచిగాన్ విశ్వవిద్యాలయం పరిశోధకురాలు యున్‌కింగ్ జియాన్, ఆమె స్నేహితుడు జున్‌యాంగ్ లియు ఫుసేరియం గ్రామినేరియం అనే ప్రమాదకరమైన ఫంగస్‌ను స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన ఘటన మరువకముందే, చైనాలోని వుహాన్‌లో హువాజోంగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీకి చెందిన పీహెచ్‌డీ విద్యార్థిని చెంగ్‌జువాన్ హాన్‌ను జూన్ 8న డెట్రాయిట్ మెట్రోపాలిటన్ విమానాశ్రయంలో ఎఫ్‌బీఐ అధికారులు అరెస్టు చేశారు. దీంతో గత వారంలో ఇది మూడవ సంఘటనగా నమోదైంది.

-చెంగ్‌జువాన్ హాన్ అరెస్టు: రౌండ్‌వార్మ్‌ల జీవ పదార్థాలు


డెట్రాయిట్ విమానాశ్రయంలో చెంగ్‌జువాన్ హాన్‌ను అదుపులోకి తీసుకున్నప్పుడు, ఆమె వద్ద నాలుగు ప్యాకేజీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్యాకేజీలలో రౌండ్‌వార్మ్‌లకు సంబంధించిన జీవ పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. ఒక ప్యాకేజీలో పుస్తకం దాచి ఉన్నట్లు కూడా అధికారులు కనుగొన్నారు. ఈ జీవ పదార్థాలు అమెరికా వ్యవసాయ రంగానికి లేదా ప్రజారోగ్యానికి ఎంతవరకు ముప్పు కలిగిస్తాయనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, ఈ రవాణా యూఎస్‌డీఏ నిబంధనలను ఉల్లంఘించిందని అధికారులు పేర్కొన్నారు. హాన్ మొదట తనకు ప్యాకేజీల గురించి తెలియదని చెప్పినప్పటికీ, తర్వాత దర్యాప్తులో అవి తనవేనని అంగీకరించింది.

-ఎఫ్‌బీఐ ఆరోపణలు, సీసీపీ సంబంధాలు

చెంగ్‌జువాన్ హాన్‌పై అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు స్మగ్లింగ్ మరియు తప్పుడు ప్రకటనలు చేయడం వంటి అభియోగాలు మోపారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఈ ఘటనను %ౚ% (ట్విట్టర్) లో పోస్ట్ చేస్తూ, హాన్‌కు చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ (సీసీపీ)తో సంబంధాలు ఉన్నాయని ధ్రువీకరించారు. ఆమె అమెరికాకు రాకముందే తన ఎలక్ట్రానిక్ పరికరాలలోని డేటాను తొలగించినట్లు గుర్తించారు, ఇది దర్యాప్తును అడ్డుకునే ఉద్దేశంతో జరిగిన చర్యగా అధికారులు భావిస్తున్నారు. ఈ సంఘటన అమెరికా ఆహార సరఫరా మరియు వ్యవసాయ రంగంపై సీసీపీ దాడులకు సంబంధించిన ఆందోళనలను మరింత పెంచింది.

-గత సంఘటనలతో పోలిక: ఫుసేరియం గ్రామినేరియం ఫంగస్

గత వారం, మిచిగాన్ విశ్వవిద్యాలయంలో పరిశోధకురాలిగా పనిచేస్తున్న యున్‌కింగ్ జియాన్, ఆమె స్నేహితుడు జున్‌యాంగ్ లియు ఫుసేరియం గ్రామినేరియం అనే ప్రమాదకరమైన ఫంగస్‌ను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డారు. ఈ ఫంగస్ గోధుమ, బార్లీ, మొక్కజొన్న, వరి వంటి పంటలను నాశనం చేసే 'హెడ్ బ్లైట్' వ్యాధికి కారణమవుతుంది, ఇది ప్రపంచవ్యాప్తంగా బిలియన్ డాలర్ల నష్టానికి దారితీస్తుంది. ఈ ఫంగస్ ఉత్పత్తి చేసే టాక్సిన్స్ మానవులు మరియు పశువులలో వాంతులు, కాలేయ నష్టం, పునరుత్పత్తి సమస్యలను కలిగిస్తాయని శాస్త్రీయ అధ్యయనాలు తెలుపుతున్నాయి. జియాన్ మరియు లియు ఈ ఫంగస్‌ను మిచిగాన్ విశ్వవిద్యాలయం ల్యాబ్‌లో పరిశోధన



కోసం ఉపయోగించాలని యోచించినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది.

-జాతీయ భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు

ఈ వరుస సంఘటనలు అమెరికా జాతీయ భద్రతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తించాయి. యూఎస్ అటార్నీ జెరోమ్ గోర్గాన్ ఈ స్మగ్లింగ్‌ను 'అగ్రోటెర్రరిజం' ఆయుధంగా వర్ణించారు, ఇది అమెరికా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు ఉద్దేశించిన చర్యగా భావిస్తున్నారు. ఎఫ్‌బీఐ మరియు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) సంయుక్తంగా నిర్వహించిన దర్యాప్తు ఈ కేసులను వెలికితీసింది. యున్‌కింగ్ జియాన్ మరియు చెంగ్‌జువాన్ హాన్‌లు చైనీస్ ప్రభుత్వం నుంచి నిధులు పొందినట్లు, సీసీపీతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఆరోపణలు ఉండటం ఈ కేసులను మరింత తీవ్రతరం చేశాయి.

-మిచిగాన్ యూనివర్సిటీ స్పందన

మిచిగాన్ విశ్వవిద్యాలయం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది, జాతీయ భద్రతను లేదా విశ్వవిద్యాలయ లక్ష్యాలను దెబ్బతీసే ఏ చర్యనైనా తాము సమర్థించబోమని పేర్కొంది. ఈ పరిశోధనలకు సంబంధించి చైనీస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు స్వీకరించలేదని, ఫెడరల్ దర్యాప్తులో పూర్తిగా సహకరిస్తామని విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. అయితే, ఈ సంఘటనలు విదేశీ పరిశోధకులు అమెరికా విద్యా సంస్థలను ఉపయోగించి సున్నితమైన పరిశోధనలు చేసే అవకాశంపై ఆందోళనలను పెంచాయి.

- బయోసెక్యూరిటీ అవశ్యకత

చైనాకు చెందిన పరిశోధకులు జీవ పదార్థాలను అక్రమంగా రవాణా చేయడం ద్వారా అమెరికా వ్యవసాయ రంగం , ప్రజారోగ్యంపై గణనీయమైన ముప్పును కలిగిస్తున్నారని ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఫుసేరియం గ్రామినేరియం, రౌండ్‌వార్మ్‌ల వంటి జీవ పదార్థాలు వ్యవసాయ పంటలను నాశనం చేయడమే కాకుండా, మానవులు , పశువుల ఆరోగ్యానికి కూడా హాని కలిగించగలవు. ఈ కేసులు అమెరికా బయోసెక్యూరిటీ నిబంధనలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ఎఫ్‌బీఐ , సీబీపీ దర్యాప్తులు ఈ రకమైన స్మగ్లింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఈ సంఘటనలు భవిష్యత్తులో అంతర్జాతీయ పరిశోధనా సహకారంపై ప్రభావం చూపవచ్చు. ఈ పరిణామాలు అమెరికా భద్రతా సంస్థలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఈ అక్రమ రవాణాను అరికట్టడానికి మరిన్ని కఠిన చర్యలు అవసరం.

# గాయని మంగ్లీపై కేసు నమోదు

రంగారెడ్డి,సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు. ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. పార్టీకి వచ్చిన వారిలో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో సింగర్ మంగ్లీపై కేసు నమోదు అయింది. అనుమతి లేకుండా బర్త్‌డే పార్టీ నిర్వహించిన కారణంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. మంగ్లీ తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం రాత్రి చేవెళ్ల త్రిపుర రిసార్ట్‌లో తన స్నేహితులకు పార్టీ ఇచ్చారు. ఈ పార్టీకి చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు సెలెబ్రిటీలు కూడా వెళ్లారు. దివి, కాసర్ల శ్యామ్, రచ్చ రవి, సింగర్ ఇంద్రావతి పార్టీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పోలీసులు రిసార్ట్‌పై దాడులు నిర్వహించారు. దామోదర్ అనే వ్యక్తి గంజాయి తీసుకుంటూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. విదేశీ మద్యాన్ని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా డీజే ప్లే చేసినందుకు డీజేను సీజ్ చేశారు. అనుమతి లేకుండా బర్త్ డే పార్టీ నిర్వహించినందుకు మంగ్లీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగ్లీతో పాటు త్రిపుర రిసార్ట్ జీఎం శివరామకృష్ణపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

# సాంకేతికతకు దూరం...

న్యూఢిల్లీ,కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి..రైతుకు అండగా ఉన్నామని చెప్పడం...అయినా రైతుల పరిస్థితి మారడం లేదు. ఇటీవలే మద్దతు ధరలను కేంద్రం సవరించింది. వరి మొదలుకుని పలు పంటలకు మద్దతు ధరలను పెంచింది. అయితే వ్యవసాయ ముఖచిత్రం మారినా...ఆర్థికంగా రైతులు, దానిని నమ్ముకున్న ఇతర పనివాళ్లు బాగు పడడం లేదు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరా ఘాతంగా మారింది. నూనెల ధరలు మండుతున్నా నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం లేదు. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గుతోంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం ఉన్నా..లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. అలాగే మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. పంటల విధానంలో మార్పులు రావాలని రైతులతో పాటు, శాస్త్రవేత్తలు, నిపుణులు కూడా కోరుకుంటున్నారు. నిజానికి కార్పోరేట్ లేదా ఇతర కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం కానుంది. అయినా ఈ విషయంలో ప్రభుత్వాలది నిర్లక్ష్య ధోరణి తప్ప మరోటి కాదు. నేటికీ పంటల విధానం, కొనుగోళ్ల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. ధాన్యాగారాల్లో మగ్గుతున్న ధాన్యం దేశం దాటి పోవడం లేదు. వాటిని ఇతర దేశాలకు అమ్ముకునేలా విధానాలు అమలు కావడం లేదు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయానికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకుంటే దేశంలోని సగం దరిద్రం పోతుంది. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇస్తే అంతర్జాతీయంగా మన పంటలకు డిమాండ్ కూడా పెరుగుతుంది. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసుకుని.. అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిది. తెలంగాణలో పండే జొన్న, మక్కజొన్న,సజ్జ పంటలకు సరైన ధరలు రావడం లేదు. రైతులను ఆదుకున్నామని చెబుతున్న ప్రభుత్వాలు..క్షేత్రస్థాయిలో రైతులు ధాన్యం కొనాటంలూ ఆందోళన చేస్తున్నా పట్టించుకోని దౌర్భాగ్యం నేటికీ కనిపిస్తోంది. రైతుల గురించి మాట్లాడుతున్న పాలకులు ధాన్యం కొనుగోళ్లలో వస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. ముందుగా వానాకాలం ... తరవాత యాసంగిలో ఏ ధాన్యం వేయాలో మండలాల వారీగా నిర్ణయించి.. రైతులకు సూచనలు చేయాలి. అవసరమైతే వారినిచైతన్యం చేయాలి.కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వాలు వ్యయసాయ విధానాలను కొనసాగిస్తున్నారు. నిజానికి ధాన్యం కొనుగోలు అన్నది ఒక పంటకు ముందే నిర్ణయించాలి. ఏ పంట వేయాలో ముందే చెప్పాలి. కానీ అదేమీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రం...కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వాలు దుమ్మెత్తి పోసుకోవడం సరికాదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఒకరి మీద ఒకరు నెపం నెట్టేసుకోవడం తప్ప ధాన్యం నిల్వలను కొనేందుకు నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు రావడం లేదు.

## దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

అమరావతి,మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యచేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు, డ్యూటీలో ఉన్న పోలీసులపై వైసీపీ సైకోలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డి మొన్న తెనాలి గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లకు ఓదార్పు యాత్ర చేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు.ఇప్పుడేమో తల్లిలా గౌరవించాల్సిన మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారికి మద్దతుగా నిలుస్తున్నారంటూ మంత్రి లోకేష్ దుయ్యబట్టారు. జగన్ తన తల్లిని, చెల్లిని మెడపట్టి బయటకు గెంటేశారని, అలాగే వారిని కోర్టుకు ఈడ్చారని ఫైర్ అయ్యారు. సొంత చెల్లి పుట్టుకపై దుష్ప్రచారం చేయించిన మీరు మహిళలను గౌరవిస్తారని ఆశించడం అత్యాశలేనని లోకేష్ విమర్శించారు. మహిళలపై వైసీపీ నేతలు మాట్లాడుతున్న మాటలకు, పొదిలిలో మహిళలపై చేసిన దాడికి జగన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రి నారా లోకేష్ డిమాండ్ చేశారు.

# నామ్‌కేవాస్తే పదవి నాకెందుకు? ఇంకెవరికైనా ఇవ్వండి!



'హైదరాబాద్,చెప్పులోని రాయి.. చెవిలోన జోరీగ.. కంటిలోని నలుసు.. కాలి ముల్లు%ూ% ఇంటిలోని పోరు ఇంతింత కాదయా' అంటూ వేమన చెప్పన పద్యానికి 'కాంగ్రెసులో పదవుల లొల్లి ఇంతింత కాదయా' అని చేర్చుకోవాలి. ఇప్పుడు కాంగ్రెసులో పదవుల లొల్లి జోరుగా సాగుతోంది. మంత్రి పదవుల్లో మాత్రమే కాదు, పార్టీ కమిటీల్లోనూ అసంతృప్తి రాగాలే వినబడుతున్నాయి. మంత్రి పదవులు రానివారు అగ్గిమీద గుగ్గిలమవుతున్న సంగతి తెలిసిందే కదా.పార్టీ కమిటీల పదవుల్లో కూడా న్యాయం జరగలేదని కొందరు నాయకులు మండిపడుతున్నారు. ఆ పదవులు తమకు అక్కరలేదని తిప్పికొడుతున్నారు. మరోపక్క మహిళా కాంగ్రెసు నాయకురాళ్లు భగ్గుమంటున్నారు. అధిష్ఠానం దగ్గరే పంచాయతీ పెడతామంటున్నారు. పార్టీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాత్రమే కాకుండా ఇతర నాయకులు కూడా పార్టీ కోసం కష్టపడ్డామని పదవులు ఇవ్వాలని డిమాండ్? చేస్తున్నారు.మంత్రి పదవులు ఇవ్వలేని వాళ్లను పార్టీ పదవుల్లో సర్దుతున్నారు. పదవుల తలనొప్పి తగ్గించుకోవడానికి బిస్కెట్లు, చాక్లెట్లు పంచినట్లు పార్టీ పదవులను పంచిపెట్టింది అధిష్ఠానం, టీపీసీసీకి జంబో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. 27 మంది ఉపాధ్యక్షులను, 69 మంది ప్రధాన కార్యదర్శులను నియమించారు. మరి ఇంతమందికి ఏం పని ఉంటుందో తెలియదు. ఈ పదవులు తీసుకున్నవారు గుంపులో గోవిందా అన్నట్లుగా ఉండాల్సిందే తప్ప వారికంటూ ప్రత్యేకత, గుర్తింపు ఉండవు. ఈ పదవుల పట్ల కొందరిలో అసంతృప్తి ఉన్నా బయటపడటంలేదు.కొందరు బాహాటంగా అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. కొందరు అసలు పదవులు తీసుకోవడానికి ఇష్టపడటంలేదు. ఈ పదవులు తీసుకున్నా, తీసుకోకపోయినా ఒకటే అనుకుంటున్నారు. వరంగల్? పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్? రెడ్డిని ఉపాధ్యక్షుడిగా నియమించారు. కాని ఆ పదవి తీసుకోవడానికి ఆయన విముఖత వ్యక్తం చేశాడు. 'నామ్?కేవాస్తే పదవి నాకెందుకు? ఇంకెవరికైనా ఇవ్వండి' అన్నాడు.ఈ పదవి ఇచ్చినందుకు వ్యంగ్యంగా కూడా మాట్లాడాడు. 'అమ్మో ..ఇంత పెద్ద పదవి నేను నిర్వహించలేను. నాకు ఎమ్మెల్యే పదవి చాలు' అన్నాడు. పార్టీ కోసం తాను అహర్నిశలు కష్టపడ్డానని, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని అన్నాడు. ఇతరుల కోసం చాలాసార్లు పదవీ త్యాగం చేశానని అన్నాడు. ఇంత చేసిన నాకు నామమాత్రపు పదవి ఇస్తారా అంటూ మండిపడ్డాడు. ఈ పదవి తీసుకోవడం తనకు ఏమాత్రం ఇష్టం లేదని, ఇదే విషయాన్ని హైకమాండ్?కు చెబుతానని అన్నాడు. జంబో కమిటీలో 15 మంది మహిళలకే పదవులు ఇచ్చారని నాయకురాళ్లు మండిపడుతున్నారు.ఇక మహిళా కాంగ్రెసును పూర్తిగా పట్టించుకోలేదు. మహిళా కాంగ్రెసు అధ్యక్షురాలు సునీతారావు సిఫార్సు చేసిన ఒక్క మహిళకు కూడా అవకాశం ఇవ్వలేదు. గతంలో ఆమె గాంధీ భవన్?లో ధర్నా చేసింది కదా. బహుశా అది కారణమై ఉండొచ్చు. పార్టీ కమిటీల్లో 33 శాతం మహిళలకు కేటాయించాలని కోరినా మూడు శాతం కూడా ఇవ్వలేదంటున్నారు. దీనిపై రాహుల్? గాంధీకి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళతామని సునీతారావు చెప్పారు. ఇప్పుడు మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేసే విషయంలో కూడా అధిష్ఠానం కిందామీదా అవుతున్నట్లు సమాచారం.

# స్థానిక ఎన్నికల కోసం ఎదురుచూపు..బిఆర్ఎస్ సత్తా చాటుతుందన్న ధీమా



కరీంనగర్, స్థానిక ఎన్నికల కోసం బిఆర్ఎస్ క్యాడర్ ఎదురు చూస్తోంది. ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తున్నారు. ఇప్పటికైతే పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నా, స్థానిక ఎన్నికల్లో మా÷-రం ప్రభావం చూపుతామని స్థానిక నేతలు ధీమాగా ఉన్నారు. ఉత్తర తెలంగాణ ఎప్పుడూ బిఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. మెదక్ ఇక చెప్పాల్సిన పనిలేదు. అయితే బిఆర్ఎస్ స్వయంకృతం కారణంగా ఆ పార్టీ ఎక్కడా ఉనికి లేకుండా పోతోంది. గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తరవాత ఇప్పుడుమరింత ప్రాభవాన్ని కోల్పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టక పోవడంతో పార్టీ కేడర్‌లో నిస్తేజం ఆవరించింది. ప్రజాందోళనల మాట ఎలా ఉన్నా కనీస కార్యక్రమాలు కూడా సాగడం లేదు. మరో మూడున్నరేళ్ల వరకు దానికి భవిష్యత్ లేనట్లుగానే భావించాలి. కరీంనగర్ మేయర్, జగిత్యాల ఎమ్మెల్యే ఇలా ఒక్కొక్కరుగా బిఆర్ఎస్‌ను వీడారు. నిజానికి కరీంనగర్ బీఆర్ఎస్‌కి కంచుకోట. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ప్రతి ఎన్నికలో సత్తా చాటింది. అంతే కాకుండా కరీంనగర్‌ని, బీఆర్ఎస్‌ను విడదీయలేని పరిస్థితి. ఇక్కడ నెగ్గితే తెలంగాణ అంతా పాజిటివ్ ఫలితాలు వస్తాయనే సెంటిమెట్ ఉండేది. 2019 ఎన్నికల నుంచి బీఆర్ఎస్ కంచుకోటకి బీటలు వారుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలలో కనీసం పోటీ కూడా ఇవ్వకుండా మూడవ స్థానానికే పరిమితం కావడం గమనార్హం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గులాబీ పార్టీ అనుకూల ఫలితాలు సాధించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికలలో గులాబిజెండా రెపరెపలాడింది. తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికలలో క్లీన్‌స్వీప్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో తొంభై ఐదు శాతానికి పైగా ఫలితాలు సాధించింది. ఈజిల్లాలో బీఆర్ఎస్‌కు ఇక తిరుగులేదన్న సమయంలో 2019 ఎన్నికలలో బిఆర్ఎస్ కి మొదటిషాక్ తగిలింది. తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికలలో అనుకూలమైనా ఫలితాలు సాధించలేక పోయింది. కనీసం ఎంపి ఎన్నికలలో గట్టి పోటి ఇస్తామని నేతలు భావించారు, ఈ ఎన్నికలతొ పార్టీ బలోపేతం అవుతుందని అంచనాలు వేసుకున్నారు. పోటి మాట ఏమో గాని మూడవస్థానానికే పరిమితమై బిఅర్ఎస్ శ్రేణులను తీవ్ర నిరాశకి గురి చేసింది. రాష్ట్రంలో ఒకటో రెండో సీట్లు బిఅర్ఎస్ గెలిస్తే అది కరీంనగర్‌లోనే గెలుస్తుందని నేతలు భావించారు. కానీ వ్యతిరేక ఫలితాలు వచ్చాయి?ఇక్కడ పార్టీ గట్టిగా ఉన్న కనీసం రెండవ స్థానంలో కూడా నిలబడలేదు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీలలో ఎక్కడ కూడా పోటీ ఇవ్వలేక పోయింది?. బిఅర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిరిసిల్లలో కూడా అదే పరిస్థితి కనిపించింది. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న కరీంనగర్ అసెంబ్లీలా కనీస ఓట్లు కూడా సాధించలేక పోయింది. మూడవస్థానానికే పరిమితం అయ్యింది. బిఅర్ఎస్ ఎమ్మెల్యే ఉన్న హుజురాబాద్ లోకూడా మూడవస్థానానికే పరిమితం అయ్యింది. ఒకప్పుడు క్యాడర్,లీడర్ లతో బలంగా ఉన్న బిఅర్ఎస్ ఇప్పుడు మూడవస్థానానికే పరిమితం కావడంతో క్యాడర్ అంతా అయోమయానికి గురి అవుతుంది. అయితే ఇది తాత్కలిక అపజయమేనని,స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా ఏమిటో చూపిస్తామని బిఅర్ఎస్ నేతలు అంటున్నారు. ఇప్పటి నుంచే స్థానిక ఎన్నికల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. దేశంలో 75 ఏళ్లలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను తెలంగాణలో గత బిఅర్ఎస్ ప్రభుత్వం సాధించిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. అస్తిత్వం కోసం 60ఏళ్లు పోరాడిన తెలంగాణ నేల.. బిఅర్ఎస్ హయాంలో అభివృద్ధిలో శిఖరాగ్రానికి చేరిందన్నారు. తొమ్మిదిన్నరేదేళ్ల స్వల్ప కాలంలోనే ఆర్థిక వృద్ధి, తలసరి ఆదాయం పెరుగుదల, విద్యుత్ సరఫరా, తాగు, సాగునీటి సదుపాయం కల్పన, ప్రజాసంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాల ప్రగతిలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కఠినమైన, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణతో ఆదాయ వనరులను పెంచుకుంటూ 2014 నుంచి 2023 వరకు దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జలవిప్లవం, హరిత విప్లవం, క్షీర విప్లవం, నీలి విప్లవం, గులాబీ విప్లవాలతో దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పారు. పల్లె ప్రగతికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళ్లడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు.

# సమిష్టి పోరాటంతోనే తెలంగాణ ఏర్పాటు

ములుగు, కేసీఆర్ ఒక్కడితో తెలంగాణ రాలేదని, తామంతా పోరాడితేనే సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్ అన్నారు. మేమందరం పార్లమెంటులో కొట్లాడితే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో మరో 25 ఏళ్ల పాటు కాంగ్రెస్‌ను నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తోందని అన్నారు. ములుగు జిల్లాలో జరిగిన ఇందిరమ్మ మహిళ పట్టాల పంపిణీ కార్యక్రమం సభ రాజకీయ వ్యాఖ్యలతో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.అయితే, ఈ సభలో ఎంపీ బలరాం నాయక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గిరిజన యూనివర్సిటీకి ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులు వస్తున్నాయి. మొత్తం 800 కోట్ల నిధులు తీసుకువస్తున్నాం అని అన్నారు. మారుమూల గ్రామాలకు బ్రిడ్జిలు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయన హరితహారం పథకంపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. హరితహారం పేరుతో హరీష్ రావు 35 వేల కోట్ల రూపాయలు తినేశారు. నేను దీనిని నిరూపించగలను, హరీష్ రావు సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. పైసలు తిన్నందువల్లే కేసుల్లో తిరుగుతున్నారు అంటూ విమర్శలు గుప్పించారు. అకాగే తెలంగాణ



ఏర్పాటుపై కూడా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. అందరం కలసి కొట్లాడితేనే తెలంగాణ వచ్చిందన్నారు. ఇదేదో కెసిఆర్ కొట్లాడితేనే రాలేదన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని నా పరిధిలో ఉన్న రెండు మండలాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత సీతక్కదే అని స్పష్టం చేశారు. అలాగే ప్రజలకు ప్రస్తుతం మార్కెట్ ధర రూ.60 ఉన్న సన్నబియ్యం ఉచితంగా అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ సామాజిక సంకల్పానికి నిదర్శనమని అన్నారు.

# ప్రాధాన్యం తగ్గుతున్న గ్రంధాలయులు



విజయవాడ,రానురాను గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గుతోంది. ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లో వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో కూడా అంతా సెల్‌ఫోన్‌పైనే ఆధారపడుతున్నారు. గూగుల్ ఓపెన్ చేసి చూస్తున్నారు. దీంతో గ్రంథాలయాలను పట్టించుకునే వారు కరువయ్యారు. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. పోటీ పరీక్షలకు ఎల్లవేళలా పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. అయితే గ్రంథాలయాలను పటిష్టం చేసుకుంటూ, ఇంటర్‌నెట్‌ను కూడా అందుబాటులోకి చేసుకునే విధంగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. గ్రంథాల పఠనంతోనే మేధస్సు సెరుగుతందని అంటున్నారు. విదేశాల్లో గ్రంథాలయాలకు ప్రాధాన్యం ఇస్తారు. అన్నిరకాలుగా వాటిని తీర్చి దిద్దుతారు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా చిన్న,చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు.అంతెందుకు స్కూళ్ల లో కూడా గ్రంధాలయాలు అతంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆయా శాస్త్రాల అధ్యయనంపై నేటి యువత మొగ్గుచూపటం లేదు.తద్వారా సమాజంతో బంధానికి దూరమవుతున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది.ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75వేల గ్రంథాలయాలు ఉన్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శనమి స్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత'గా పేరు పొందారు. గ్రంథాలయోద్యమం ఏపిలో బాగానే జరిగింది. అనేక ఉద్యమాలకు ఇక్కడ పునాది పడింది.

# యూపీఐ చెల్లింపులపై బాదుడు? కేంద్రం క్లారిటీ ఇదే!




న్యూఢిల్లీ,ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమేజాన్ పే.. ఇలా లెక్కలేనన్ని యూపీఐ యాప్ లు అందుబాటులోకి రావడంతో భారత్ లో మెజారిటీ జనం నగదుగా డబ్బు చెల్లించడం దాదాపుగా మానేశారు. ఈ పేమెంట్ యాప్ లలో దేనినో ఒకదాని ద్వారా వారు తమ చెల్లింపులు చేస్తున్నారు. ఈ తరహా పేమెంట్లలో భారత్ దూసుకుపోతోందని చెప్పక తప్పదు. కొందరైతే దాదాపుగా అన్ని యాప్ లను కూడా ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. అయితే గత కొంతకాలంగా ఈ తరహా యూపీఐ పేమెంట్లపై చార్జీలు వేస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై గతంలో ఓ దఫా కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.తాజాగా గత రెండు, మూడు రోజులుగా ఇదే తరహా ప్రచారం మరోమారు ఊపందుకుంది. బుధవారం అయితే ప్రధాన మీడియా సంస్థలన్నీ యూపీఐ చెల్లింపులపై బాదుడు తప్పదని ఏకంగా గణాంకాలతో సహా ఊదరగొట్టేశాయి. తెలుగు టాప్ న్యూస్ ఛానెళ్లు అయితే ఏకంగా స్టోరీల మీద స్టోరీలు ప్రసారం చేశాయి.వినియోగదారుల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు కాకపోవడంతో తాము బాగా నష్టపోతున్నామని యూపీఐ సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాయని, తప్పని సరిగా చార్జీలు మోపాల్సిందేనంటూ ప్రతిపాదించాయని ఆయా మీడియా సంస్థలు తెలిపాయి.ఈ ప్రచారంపై కాస్తంత ఆలస్యంగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది. యూపీఐ చెల్లింపులపై ఎలాంటి చార్జీలు మోపే అవకాశమే లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ క్లియర్ ప్రకటనను విడుదల చేసింది. యూపీఐ చెల్లింపుల్లో రూ.3 వేలు దాటితే కొంత మొత్తం మేర చార్జీ లని కొన్ని సంస్తలు, రూ.2 వేలు దా టితే కొంత చార్జీ అని మరికొన్ని సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ తప్పుడు వార్తలను, ప్రకటనలను ఎవరూ నమ్మవద్దంటూ కేంద్రం ఫుల్ క్లారిటీ ఇచ్చింది. మరి కేంద్రం నుంచి ఇంతటి క్లారిటీ వచ్చిన తర్వాత అయినా ఈ వదంతులకు చెక్ పడుతుందో, లేదో చూడాలి.


# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత..ఆందోళనలో తల్లిదండ్రులు



నిజామాబాద్,జూన్ అంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నెలలోనే విద్యాసంస్థలు ప్రారంభమవుతాయి.ఈ నెల 12 నుంచి కొత్తవిద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల చదువుకు పెట్టే ఖర్చులపై తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పటికే ఫీజుల వసూల్లు, పుస్తకాల కొనుగోళ్లు పూర్తయ్యాయి. డ్రెస్సులు, షూస్ వంటి కొనుగోళు కూడా ముందే కానిచ్చేశారు. ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపే తల్లిదండ్రులు ఇప్పటికే పిల్లలకు బడ్జెట్ కేటాయించుకోవాల్సి వచ్చింది. కొత్తగా అడ్మిషన్ తీసుకునేవారు ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అడ్మిషన్, డొనేషన్ ఫీజులు చూసి జంకుతున్నారు. ఇదివరకే చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువుల కొనుగోలుతో తల్లిదండ్రులకు జేబులకు చిల్లుపడను ంది. దీంతో 'వామ్మో జూన్' అంటూ తలపట్టు కుంటున్నారు. ఒక వైపు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలి, ఏయే స్కూల్‌లో ఏ స్థాయి ఫలితాలు వచ్చాయి, తదితర అంశాలపై తల్లిదండ్రులు విశ్లేషించుకోవడం కూడా పూర్తయ్యి ంది. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఫీజులు చుక్కలనంటుతున్నాయి. బుక్స్, యూనిఫాం, పెన్నులు, పెన్సిల్ ఇతరాత్ర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. పేద, మధ్య తరగతి కుటంబీకుల జేబులకు చిల్లుపడే మాసం వచ్చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 600 పైగా ప్రైవేట్ పాఠశాలల్లో వాటి విద్యాప్రమాణాలు, ఇతర అంశాలతో కూడిన స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుంచి మొదలుకొని రూ.లక్షకు పైగా ఫీజులున్నాయి. అందులోనూ ఐఐటీ, ట్యూషన్, సాంస్కృతిక, కరాటే తదితర అంశాలు నేర్పించేందుకు అదనంగా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్నాయి. వీటిలో కొన్ని తోకల పేరుతో 1వ తరగతికే రూ.లక్షల్లో వసూలు చేయడం విశేషం. కొన్ని పాఠశాలలైతే నిబంధనలకు విరుద్ధం గా అధిక ఫీజులు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అప్పు చేసైనా ప్రైవేట్ స్కూల్ అనేది వేళ్లానుకోవడంతో దిగువ, మధ్య తరగతి జనం కూడబెట్టుకున్న దానికి మరికొంత అప్పు చేసి పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. మరోవైపు వానాకాలం సీజన్ మొదలవ్వడంతో రైతులు పెట్టుబడుల కోసం తిప్పలు పడుతున్నారు. విత్తనాలు, ఇతర ఖర్చులకు డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూనే బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఈనెల ఎలా గట్టేక్కుతుందా అని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. ఏటా రైతులకు వానాకాలం సీజన్ భారంగా మారుతోంది. ఈ యాసంగి పంటలు పండినా ధాన్యం డబ్బు చేతికి రాని దైన్య స్థితిలో రైతులు ఉ న్నారు. వ్యవసాయ పనులూ అంతంతే. ఇతరత్రా కూలీ పనులు దొరక్క గ్రామీణుల్థు ఉపాధి పనులకు వెళ్లినా కొద్ది రోజులుగా డబ్బులు అందక వారి పరిస్థితి గందరగోళంగా ఉంది. మండుతున్న ఎండల్లో ఉపాధి పనులకు వెళ్తే రూ.200 నుంచి రూ.250 వరకు దక్కడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖరీ ఫ్‌నకు సంబంధించి ఎరువులు, విత్తనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# గాలి జనార్ధన్ రెడ్డి శిక్షపై తెలంగాణ హైకోర్టు స్టే!

హైదరాబాద్,మైనింగ్ డాన్ గాలి జనార్ధనా రెడ్డికి అదృష్టం కలసి వస్తోంది. ఎన్నో ఏళ్ల వాయిదాల తర్వాత విచారణ పూర్తి చేసి శిక్ష ఖరారు చేస్తే.. పై కోర్టులో ఆయనకు ఊరట లభించింది. ఆయనకు విధించిన శిక్షపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. ఆయన విదేశాలకు వెళ్లకూడదని..పాస్ పోర్టు సరెండర్ చేయాలని ఆదేశించింది. శిక్ష ఖరారయ్యే వరకూ ఆయన కండిషనల్ బెయిల్ పై ఉన్నారు. విదేశాలకు వెళ్లాల్సిన ప్రతీ సారి కోర్టు అనుమతి తీసుకునేవారు. పది లక్షలు చెప్పిన రెండు ష్యూరిటీలు కల్పించాలని హైకోర్టు ఆదేశించింది.తాను ప్రజా ప్రతినిధినని.. ప్రజలకు సేవ చేయాల్సి ఉందని గాలి జనార్ధన్ రెడ్డి వాదించారు. తాను అక్రమ మైనింగ్ చేయలేదని ఆయన వాదించలేదు. తనపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని.. ఆయన చెప్పారు. గతంలో తెలంగాణ హైకోర్టులో ఐఏఎస్ శ్రీలక్ష్మికి ఊరట లభించింది. తర్వాత సుప్రీంకోర్టు ఆమెపై విచారణ జరపాలని ఆదేశించింది. ఆ విచారణ జరగాల్సి ఉంది. నిందితులందరికీ శిక్షపడినా ఆమె మాత్రం హైకోర్టు ఉపశమనంతో విచారణ నుంచి తప్పించుకున్నారు. మరోసారి ఆమె ప్రమేయంపై విచారణ జరగాల్సి ఉంది.గాలి జనార్ధన్ రెడ్డికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో ఆయన .. కర్ణాటకలోని గంగావతికి ఎమ్మెల్యేగా అనర్హతకు గురయ్యారు. ఇప్పుడు శిక్షపై



హైకోర్టు స్టే విధించడంతో అక్కడ ఉపఎన్నిక జరిగే అవకాశం లేదు. మళ్లీ ఆయనపై హైకోర్టు విచారణ జరిపి శిక్ష ఖరారు చేస్తే అనర్హతా వేటు పడుతుంది.. ఆయన మైనింగ్ చేసినట్లుగా సాక్ష్యాలు లేదనుకుంటే కేసు కొట్టేస్తారు. ఏది జరిగినా మళ్లీ ఇరు వర్గాలు సుప్రీంకోర్టుకు వెళ్తాయి. ఈ కేసు మరింత కాలం సాగడం ఖాయమని తాజా పరిణామాలతో స్పష్టమవుతోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com